# ప్రగతి

బోయి భీమన్న

# ప్రగతి పథం

సత్య మద్వైత మని పల్కె శంకరుండు,
అగును నిజము రసాద్వైత మందు నేను!
నిజమె సత్యము, సత్యమె నిజము తెలిపి
అమృత పదవిని సమకూర్చునదియె ప్రగతి!
ప్రగతిని గురించిన నా దర్శనం ఇది.

'ఎవరి దర్శనం వారిది. నీ దర్శనం నీకే వుంచుకో. ఏ వ్యక్తి దర్శనం ఆ వ్యక్తి వ్యక్తిత్వం తోటిది. మా అందరికీ ఏకకాలంలో దర్శనీయమయిందేదైనా వుంటే చూపు. మమ్మల్ని విసిగించకు. నీకు పుణ్యముంటుంది'' అన్నాడు మిత్రుడు – నేను ''లక్ష్మీ కుమారి'' అనే పేరుతో పదహారేళ్ళ క్రితం వ్రాసి, పాత ఫైళ్ళలో కట్టిపారేసి వుంచిన ఒక నాటకం వ్రాతప్రతిని పైకితీసి, దుమ్ముదులిపి, దానిని ప్రగతిగా మారుస్తుండడం చూస్తూ!

ఆ మిత్రుడే నేను ఆ నాటకాన్ని పరిష్కరించుకొంటూ తిరిగి ఈ రూపంలోకి తేవ డానికి నాకు మార్గమిత్రుడైనాడు. ఈ నాటకంలో ఒక పాత్రకూడా అయినాడు.

మిత్రుడు అని నేనంటున్న ఈ పాత్ర ఒక వ్యక్తి కాడు. ముగ్గురు వ్యక్తులు. ఒకరు బొజ్జా తారకం, రెండవ వారు వారా వేణు, మూడవ వారు నా అర్ధాంగి హైమవతి. ఈ హైమవతి మరీనూ!

నిజమే.

సాంప్రదాయక బలహీనతలను, రాగద్వేషాలను, సాంఘిక ప్రతిష్ఠలను, అన్నిరకాల ప్రిజిడిస్సులను వదిలేసి మౌలికంగా ఆలోచించి చూస్తే మిత్రుడు చెప్పింది నిజమే!

అవును.

నీ మతం, నీ భక్తి బోధ, నీ వేదాంత వైభవం, అవన్నీ ఎవడిక్కావాలి? నీవు దర్శించిన ఆ దేవుణ్ని, ఆ పరమాత్మను, ఆ ప్రగతిని మాకు కూడ చూపు!

ఈ సవాలుకు జవాబు చెప్పగలవాడెవడు?

సర్వసమత, దారిద్ర్య నిర్మూలన, అవిద్యాతొలగింపు, అందరికీ తిండి, ఎల్లరకూ పని, సర్వులకూ విద్య, సర్వేజనా స్సుఖినోభవంతు వంటి మాటలను అర్థం తెలిసే

అంటున్నారా రాజకీయ నాయకులంతా? మరి ప్రజలంతా ఎందుకు నమ్ముతున్నారు?

"నీ పొరుగువాడి సంపదకోసం నీవు ఆశించకు" అంటూ రెండు వేల సంవత్సరాల క్రితం ఏసుక్రీస్తు చెప్పినమాట ఎంతమంది కర్థమయింది? ఆ మాటల్లో క్లిష్టత ఏమున్నది? ఆనాటి నుంచీ ఎన్నికోట్ల కోట్ల మంది ఆ మాటను బోధించారు? విన్నారు? చదివారు? మరి ఆచరించారా? ఎందుకు ఆచరించలేదు? అర్థంగాకనే కదా?

## గతి – ప్రగతి

"ఏది గతి? ఏది ప్రగతి?" అనే పాట వుంది నాటకంలో. అది కొంచెం చదవండి.

భూమి తిరుగుతున్నంతకాలం గతి వుంటుంది. మనిషే కాదు, తదితర జీవ రాశి కూడ జడమై పడివున్నప్పటికీ సూర్యోదయం అవుతూనే వుంటుంది. సూర్యాస్తమయం అవుతూనే వుంటుంది. వాటితోపాటు శారీరక వృద్ధి క్షయాలు, అందుకు అనుబంధితాలైన పనిపాటులు, సత్వర సంపాదనలో పోటీలు, పోరాటాలు అన్నీ జరుగుతూనె వుంటై. అవన్నీ 'గతి'లోని భాగాలు. ప్రగతికి సంబంధించినవి కావు.

మరి ప్రగతి అంటే ఏమిటి?

ప్రగతి అంటే ప్రకృతి సిద్ధమైన గమనం కాదు. అదొక విలక్షణమైన మానవ మేధస్సు మాత్రమే సాధించగల ఒక శ్రేయస్సుందర కళాత్మక పురోగమనం.

తన మేధస్సు వికసించేకొలదీ మానవుడు తన సహజగతిని తేజోవంతం చేసుకొంటూ, అందుకు తగినట్టుగా ప్రకృతిని, పరిసరాలను మలుచుకొంటూ, తనతోపాటు తన సమాజాన్నీ జాతినీ శ్రేయోమార్గంలో నడిపించుకుపోవటానికి చేసే కృషియొక్క సంపూర్ణ సత్ఫలితమే ప్రగతి.

అంత భేదం వుంది గతికీ, ప్రగతికీ!

కళా సౌందర్య సమాలంకృతమైన గతే ప్రగతి.

ఆహార, నిద్రా, మైథున, భయ సంయుతమైన సహజ చతుష్పాత్తు గతి.

ఈ చతుష్పాత్తును (నాలుగు కాళ్ళ జంతువును) పరోపకార, స్వార్థ త్యాగ ద్విపాత్తుగా (రెండు కాళ్ళ మనిషిగా) కూర్చడానికి అనాదిగా మేధావులు ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. బాధలు పడుతూనే వున్నారు. విఫలులవుతూనే వున్నారు. సామాన్యజనం మాత్రం ఆ నాలుగు కాళ్ళ జంతువుగానే వుంటూ వస్తున్నది. విసిగిపోయిన

ఋషులు దానికి "ధర్మదేవత" అనే మంచి పేరు పెట్టగా, స్వార్థపరులైన మతాధిపతులు దాని కాళ్ళు కట్టేసి, దాని శ్రమ ఫలితాన్ని పిండుకు తాగేస్తున్నారు.

నేటి పరిస్థితి కూడా ఇదే.

సూత్ర గ్రంథం

భారతదేశంలో చారిత్రకంగా మనకు తెలిసిన అతి పురాతన నాగరికత సింధు నదీ లోయలోని హరప్పా మెహెంజదారో శిధిలాలది.

ఒక మహా ప్రళయంలోనో, పోరాటంలోనో నాశనమైపోయిన మానవ నాగరికత అది. అదొక దశాంతం – యుగాంతం.

అక్కడ నుంచి ఇక్కడి దాకా, మన దాకా జరిగిన పురోగతినే సూత్రప్రాయంగా చిత్రించాను ఈ చిన్ని నాటకంలో.

ఇదొక సూత్ర గ్రంథం. ప్రతి అక్షరాన్నీ, పదాన్నీ, వాక్యాన్నీ కూడ పట్టి పట్టి చూడవలసి నట్టిది. ప్రతి పాత్రనూ ఒక మానవ స్వభావంగా పరిశీలించి సరిదిద్దుకోవలసి నట్టిది. ప్రతి సంఘటనా ఒక చారిత్రక పరిణామం అవుతుంది.

సృష్టిలో మానవుడొక జీవి. మన పూర్వుల అంచనా ప్రకారం ఎనభై నాలుగు లక్షల జీవ జాతులలో మానవ జాతి ఒకటి. పూర్వుల అంచనా అని ఎందుకంటున్నానంటే – ఆధునికుల అంచనా ఏదీ లేదు కనుక!

సృష్టిలో ఎన్ని జాతుల జీవుల (ఖిఇుఛిజ్ఛీట) ఉన్నాయో ఆధునిక సైన్సు లెక్క కట్టలేదు. (ఏమో, నాకు మాత్రం తెలీదు).

అన్ని జీవ జాతుల వంటిదే మానవ జాతి కూడ. ఒక్కొక్క జీవ జాతిలో ఒక్కొక్క గుణం అంకురిస్తే – అన్ని గుణాలు మానవుడిలో వికసించినై.

అంటే – మానవుడు సర్వగుణ సంపన్నుడే కాని, కేవల సద్గుణ సంపూర్ణుడు మాత్రం కాడు.

సింహ క్రౌర్యం, శునక విశ్వాసం, నక్క జిత్తులు, తోడేలు ప్రేమ, కోకిల గానం, నెమలి నాట్యం, పాము పగ, ఏనుగు బలం, నదుల వేగం, నవల త్యాగం, కీట భ్రమర పరిణామం, కొంగ జపం, దొంగ వ్యాపారం – అన్నీ మానవుడిలో వున్నై కూడ.

ఈ పరస్పర విరుద్ధమైన గుణాలు ఘర్షించేటప్పుడు కలిగే ఫలితమే జాతి మొత్తానికి ఆత్మహత్య. అదే కురుక్షేత్రం. అదే యాదవ కుల ముసలం, అదే ప్రళయం – అదే హరప్పా శైథిల్యం!

కాగా – అన్ని ఇతర జీవుల వంటివాడే మానవుడు కూడ. కేవల స్వార్థపరుడు. "శరీరం మాంద్యం" తర్వాతనే "ఆత్మవత్ సర్వ భూతాని".

ఈ జాతిని "సర్వే జనాః సుఖినో భవంతు" అనే ధర్మం కేసి మళ్ళించడానికి యుగ యుగాలుగా, దేశ దేశాలలో వందలకొలది ప్రవక్తలు త్యాగలు చేశారు. కాని, ఏం సాధించారు? యుగ యుగాలుగా దశావతారా లెత్తుతున్న మన విష్ణువు కూడ ఏం చెయ్యగలిగాడు? ఎవరో ఒక దుష్టుడ్ని చంపితే చాలా! ఒక ఆశ్రితుణ్ని రక్షిస్తే చాలా?

అందుకే నేను హెచ్చరించే దిది – మతమూ వద్దు, దేవుడూ వద్దు, నీతి బోధలూ వద్దు. మానవుణ్ని మానవుడుగా గుర్తిద్దాం. అందరికీ సుఖవంతమైన మార్గంలో ముందుకు సాగుదాం. సాముదాయక మానవ శ్రేయస్సునే దైవంగా ఆరాధిద్దాం!

స్త్రీలకు అన్నిటా సమాన హక్కులుండాలనే ఉద్యమంలో నుంచి – శారీరక బల ప్రదర్శనలో కూడ స్త్రీలు పురుషుణ్ని ఎదిరించి జయించగల శక్తి యుక్తులు సంపాదించు కోవాలనే ఒక్క అంశాన్నే నేను ఈ నాటకానికి వస్తువుగా తీసుకున్నా – సర్వతోముఖ ప్రగతి సాధనకు కొన్ని సూచనలను కూడ ఇక్కడ చేస్తున్నాను. ఇది అప్రస్తుతం కాదనుకుంటున్నాను.

## భూమిని జాతీయం చెయ్యాలి

మానవజాతి నిజంగానే ప్రగతి పథంలో పయనించాలంటే, ప్రగతిని సాధించడానికి మనస్ఫూర్తిగా కంకణం కట్టుకొన్న ప్రజాప్రతినిధుల ప్రభుత్వం నిర్భయంగా, నిర్మొగమాటంగా, స్వపర భేదాలను విడిచిపెట్టి –

(1) వ్యవసాయ భూమిని జాతీయం చెయ్యాలి. (2) నిత్య వాడకం వస్తువుల పరిశ్రమలను (3) సేవలను కూడ జాతీయం చెయ్యాలి. (4) వేల కొలదిగా వున్న చిన్న చిన్న గ్రామాలను రద్దుచేసి, వాటిని సమీపంలోని పెద్ద గ్రామాలతోను, పట్టణాలతోను చేర్చి వెయ్యాలి. అప్పుడు వాటికి ఆధునిక నాగరిక సౌకర్యాలను సులువుగా కల్పించవచ్చు.

చిన్న చిన్న గ్రామాల రద్దువల్ల, విశాలమైన భూభాగాలు వ్యవసాయ క్షేత్రాల క్రిందకు

రాగలవు. యాంత్రిక సేద్యం సాధ్యం కాగలదు.

(5) మైనారిటీ తీరిన ప్రతి వ్యక్తికి ఒక ఇళ్ల స్థలం లభించాలి. దానిపై ఆ వ్యక్తికి సర్వాధికారాలూ వుండాలి – అమ్ముకునే హక్కు తప్ప. గృహాలను ఎవరి అభిరుచికి తగ్గట్టు వారు నిర్మించుకోవాలి. అందుకు ప్రభుత్వం సహాయపడాలి.

(6) విద్య, వైద్యం ఉచితంగా లభించాలి. విద్యను నేటి ప్రభుత్వ పద్ధతిలోకాక, పూర్వపు గురుకుల పద్ధతిలో నేర్పాలి. నేటి మిషనరీ విద్యా సంస్థలను అందుకు ఆదర్శంగా తీసుకోవచ్చు. క్రమశిక్షణ, అభ్యాసాసక్తి సమగ్రంగా వుండాలి.

(7) వృద్ధాప్యంలో నిశ్చింతగా గడపడానికి ఆశ్రమాలు ఏర్పాటుచెయ్యబడాలి. భోజన వసతి వినోద సౌకర్యాలన్నీ ఉచితంగానే కల్పించబడాలి.

పిల్లలను గురించిన బెంగలు లేకపోతే, మానవజాతి సమస్యలు 90 శాతం వాటంతటవే పరిష్కారమైపోతై.

(8) "పనికి తిండి" పథకాన్ని సమగ్రపరచి, ప్రతి రంగంలోను వాడుకోవచ్చు. దీనివల్ల భిక్షాటన అదృశ్యమైపోతుంది. నిరుద్యోగం నశిస్తుంది. ప్రజా సౌకర్యపు పనులన్నీ చురుకుగా, చవకగా జరుగుతై. (9) పిల్లల విద్య ఆరోగ్యం, ఉద్యోగం, తిండి, తీరిక, ముసలి తనంలో పోషణ – ఇవే కదా సమస్యలు? వీటి కోసమే కదా మానవుడు స్వార్థపరుడు, దుష్టుడు, లంచగొండి, దొంగ అవుతున్నది? వీటిని పరిష్కరించడం అంత దుష్కరమా? ముమ్మాటికీ కాదు. మరి?

ఇప్పుడున్న పెద్ద స్వాములు తమకు భూమీ, ధనమూ తెచ్చి పెడుతున్న ప్రత్యేక సౌకర్యాలను, అధికారాలను వదులు కోవడానికి ఇష్టపడడం లేదు. అదే మానవ దుస్థితి కంతకూ ప్రధాన కారణం. ఇప్పుడే కాదు, ఎప్పుడూ ఇదే దుస్థితి. దీన్ని తొలగించడానికి పూర్వం భగవంతుడు అవతారాలెత్తాడు. ఇప్పుడు పై వాళ్ళు తమంతట తాముగా త్యాగాలకైనా సిద్ధపడాలి. క్రింది వాళ్ళు వీర భద్రావతారాలైనా ఎత్తాలి.

వీరభద్రావతారా లెత్తడమంటే, నా వుద్దేశం – మానవులంతా సమైక్య శక్తిగా ఏర్పడి, విజృంభించి, అసమానత్వం మీదా, అన్యాయం మీదా, దోపిడీ మీదా, దురహంకారం మీదా, తిరగబడి ఓడించి, ధర్మ సంస్థాపన చెయ్యడం. ఒక నిరంకుశ దుష్టజాత్యహంకార నియంతృత్వాన్ని ఎదిర్చి నాశనం చేసిన దళిత జన సమైక్య శక్తే వీరభద్రుడు. శివుడు హరిజనుడనే సత్యాన్ని నేను నా కవితలలో అనేకచోట్ల చర్చించి వున్నాను.

ఇక్కడొక వాస్తవాన్ని సహృదయులు గుర్తించాలి. నేను అవసరాన్నిబట్టి, వస్తు వివరణ కోసం హైందవ పురాణ నామాలను ఉదహరించినా, వాటిని మతాతీత సార్వత్రిక పదాలుగానే తీసుకోవాలి. వీరభద్రుడంటే ఒక అగ్రహోదగ్రుడైన విప్లవకారుడు. దళిత జన సేనాధిపతి. అలా.

## కులం మార్పిడి

మానవజాతిలో యుగ యుగాలుగా అభివృద్ధి జరగలేదనే నా వుద్దేశ్యం. సంఖ్యలో అభివృద్ధి జరిగింది. ఆలోచనా శక్తిలో, సృజనాత్మక పరిధిలో, అభివృద్ధి జరిగింది. దానితోపాటు పోటీ పోరాటం కూడ పెరిగింది. తాను బ్రతకడమెలా అనేది తీవ్రరూపం దాల్చింది. Struggle for existence, survival of the fittest, అనే సిద్ధాంతాలు మరీ క్రూర రూపం ధరించి, మానవత కుంచించుకు పోయింది.

ఈనాడు ప్రతివాడూ "తాను బ్రతికితే చాలు" అనుకునే స్థితికి వచ్చాడు.

మానవజాతి నిజంగానే అభ్యుదయం సాధించాలంటే, మానవుడు మరో మెట్టు పెరగాలంటే చెయ్యవలసిందేమిటో నా కావ్యాలనిండా సమగ్రంగా చెప్పే వున్నాను.

మతం మార్చుకోవడానికి వీలున్నట్టే, కులం మార్చుకోవడానికి కూడ వీలుండాలి. అట్టి వీలును కలిగిస్తూ ప్రభుత్వం చట్టం చెయ్యాలి.

వేద యుగం నుంచి పురాణ కాలం దాకా, మహాభారత కాలం దాకా కూడ కుల వ్యవస్థ లేదు. గుణ కర్మలను బట్టి అంటే స్వభావాన్ని వృత్తినీ బట్టి కుటుంబ వర్గాలు ఏర్పడుతూ వచ్చాయి. పూర్వ ఋషుల, రాజుల చరిత్రలన్నీ ఇందుకు ఉదాహరణలే.

శూద్రుడైన కర్ణుడు అప్పటి కప్పుడు, అక్కడి కక్కడ అంగ రాజ్యాభిషిక్తుడై, క్షత్రియు డైనాడు.

నేను హిందువుణ్ని. నా బావ మరిది ముస్లిం, భార్య క్రిస్టియను, అల్లుడు బౌద్ధుడు. కొడుకు నాస్తికుడు కావచ్చు. అలానే రాజకీయాలు కూడా.

అలానే – స్వభావాన్ని బట్టి, వృత్తిని బట్టి తండ్రి టీచరు, కొడుకు రైతు, అల్లుడు పోలీసు, భార్య మంత్రి, బావమరిది జర్నలిస్టు కావచ్చు. పూర్వం అలానే వుండేది. ఆనాడు నాలుగు వృత్తులే ప్రధానంగా వుండేవి. సమాజం నాలుగు కుటుంబ వర్గాలుగా వుండేది.

జనాభా పెరిగే కొలదీ వృత్తుల సంఖ్యా పెరిగింది. ఏ వృత్తి వాళ్ళు ఆ వృత్తి కుటుంబాలతోనే సంబంధాలు పెట్టుకుంటారు కనుక, వృత్తులతోపాటు వృత్తి వర్గాలూ పెరిగాయి. అవే ఆనాటి వర్ణాలూ, ఈనాటి కులాలూ.

నేను అనేక చోట్ల వ్రాశాను, అనేక సభల్లో చెప్పాను - కులం వేద విరుద్ధంగా, పుట్టుకతో ఏర్పడడం మొదలైన దుర్ముహూర్తం నుంచే ఆర్ష జాతి పతనం ప్రారంభమయిందని.

మనం తిరిగి గత వైభవాన్ని అంటే - ఉపనిషత్కాల వైభవాన్ని సంతరించుకోవాలంటే - ఈనాడు అమలులోవున్న పుట్టుకులం పద్ధతి రద్దు కావాలి. గుణ కర్మలను బట్టి కులం పరిగణించబడాలి. అంటే - కులం మార్పు చట్ట సమ్మతం కావాలి. ఎవరైనా సరే చట్ట రీత్యా కులాన్ని మార్చుకునే వీలుండాలి. అందుకు ఒక చట్టాన్ని, తగు నియమాలను, ప్రత్యేక డైరక్టరేటును రూపొందించాలి.

దీనివల్ల జరిగే తుది మేలు - కుల నిర్మూలన. ఏక జాతి ఆవిర్భావం.

మగవాడు తన భుజబలంతో స్త్రీని లొంగదీసుకొని, న్యాయంగా ఆమెకు చెందిన కుటుంబ పెత్తనాన్ని స్వాధీనం చేసుకొని, ఆమెను తన సొంత సామానులో ఒక శాల్తీనిగా చేసుకొని, సమాజ పాలనకు పూనుకొన్న నాటి నుంచీ కూడ అతడు నిరంకుశంగా ప్రవర్తి స్తూనే వస్తున్నాడు. పురుషుడికి కాంతా కనకా అంటే ప్రాణం. మేరు గిరులు, వెండి కొండలు, అప్సరసలు, స్వర్గ సౌఖ్యాలు వగైరా అన్నీ అతడి ఊహాసృష్టే. బ్రతికినంత కాలం వేటి కోసం తాపత్రయ పడతాడో, చచ్చిన తర్వాత కూడ వాటికోసమే ఆశపడతాడు. అతడి ఊహలకు పాలుపోసి పెంచుతారు మతాధిపతులు, స్వప్రయోజక వంచకులు.

తన కలానికి ఎంత స్వాతంత్ర్యం వుందో, తన స్త్రీకి కూడ అంతే స్వాతంత్ర్యం వుంది. ఒకటి తాను యోచించినట్టు వ్రాస్తుంది. రెండోది తాను చెప్పినట్టు చేస్తుంది.

తల్లిదండ్రుల ఆస్తిపై కొడుకులతో పాటు కూతుళ్ళకు కూడ సమాన వాటాలు వచ్చినప్పుడు మాత్రమే స్త్రీలకు పురుషులతో పాటు సమాన హక్కులు ఏర్పడతై.

అవి రెండు విధాలుగా వస్తై. (1) ఎవరైనా యివ్వాలి. (2) వాళ్ళు పోరాడి సంపాదించుకోవాలి.

స్త్రీలు వాస్తవంగా పోరాడి, తమ హక్కుల్ని గెల్చుకోవడమనేది చాల క్లిష్టమైన సమస్య. చూపుమేర దూరంలో కనిపించే లక్ష్యం కాదది.

సమాజ వ్యవస్థ ఆదిలో తల్లి పెత్తనం నుంచి క్రమంగా తండ్రి పెత్తనంలోకి మారడానికి ఏవి కారణాలో, దీనికీ అవే కారణాలు. (1) స్త్రీలకి ప్రకృతి కల్పించిన కొన్ని బలహీనతలు (2) ఆ బలహీనతలే పురుషుణ్ని కట్టి వుంచగల సౌందర్యాలు కనుక, అవి తన స్వాధీనం నుంచి పోతాయేమో అనే పురుషుని నిరంతర భయాందోళనలు (3) ప్రకృతి పురుషుని పట్ల కనబరచిన ప్రత్యేకాభిమానంవల్ల అతడికి లభించిన వివిధ శక్తులు, సౌకర్యాలు!

ఎవరేమనుకొన్నా, సత్యం చెపుతున్నాను – పురుషుడు ఇవ్వకుండా స్త్రీకి ఏ హక్కులూ లభించవు.

పురుషుడు స్వార్థపరుడు కనుక, స్త్రీ విషయంలో ఇన్‌ఫీరియారిటీ మనస్తత్వం కలవాడు కనుక, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఇవ్వడానికి అంగీకరించడు.

"వరకట్న దురాచారం పోవాలంటే, తండ్రి ఆస్తిలో కొడుకులతోపాటు కూతుళ్ళకు కూడ సమాన వాటా ఇవ్వబడాలి. వట్టి నీతులవల్ల, నినాదాలవల్ల లాభం లేదు." అంటూ నేను దశాబ్దాలుగా చెపుతూ వస్తున్నాను. వినిపించు కొన్న వాళ్ళే లేకపోయారు.

ఈనాడు జరుగుతున్న సంఘటనలను పరిశీలించి చూస్తుంటే – చరిత్ర పునరావృత మవుతూ వుంది. సామాన్యుడు పెరగడం లేదు. అతణ్ని మతాధిపుడు పెరగనివ్వడం లేదు! కాదా?

స్త్రీలకు, ప్రభుత్వోద్యోగాలలో వుంటున్న స్త్రీలకు కూడ ఆపాదమస్తకం బురఖాలు తొడుగు మంటున్నారు కొందరు మతోన్మాదులు!

మతం ఒక మెదడు జబ్బు. దానికి ఉన్మాదం తోడైతే కోతి కల్లు తాగినట్టే కదా?

మగవాడికి స్త్రీ అంటే అంత భయం ఎందుకో?

## లేత మొగ్గ కాదు

నీవు నవ నవేక్షు రస దేవతవు
నేను చిన్న చిరువేప పూమొగ్గను"

మొన్న సిద్ధార్థి ఉగాది నాడు, గ్రీన్ లాండ్సులో, ముఖ్యమంత్రి చెన్నారెడ్డిగారు జరిపిన ఉగాది పండుగ కవి సమ్మేళనలో పాల్గొని నేను చదివిన కవితలోని చివరి పంక్తులవి.

ఈ పంక్తులు చదివిన వెంటనే, రెడ్డిగారు లేచి వచ్చి, నాకు సన్మానం అందజేస్తూ, చిరునవ్వుతో అన్నారు "మీరు లేత పూమొగ్గకాదు. విరిసిన పువ్వే" అని!

ఆ తర్వాత సాగిన తమ ఉపన్యాసంలో నా కవిత నుంచి కొన్ని పంక్తుల్ని ఉదాహరించ డమే కాకుండా, విధాన పరిషత్తులో నేను నిర్వహిస్తున్న పాత్రను గురించి కూడ ప్రశంసలు విసిరా రాయన!

అంటే – కౌన్సిలులో నేను చేస్తున్న విమర్శలను, సూచనలను ఆయన నిశితంగా పరిశీలిస్తున్నారన్నమాట! అదీ నా ఆనందం.

శరీరాలు, వాటి స్థితిగతులు కాదు ముఖ్యం. వయస్సూ, అది తెచ్చే పరిణామాలూ కూడ కాదు. నిత్య నిరంతర నవోదయం కవిత. చిగురు, మొగ్గ, పువ్వు, కాయ, పండు – ఈ పంచతన్మాత్రలకూ అంతర్వాహిని రసం. ఆ రసకలశంలో నేనొక లేత మొగ్గనే. పూర్ణ ఫలాన్నని ఎవరైనా అనుకుంటే – అది వారి సౌహార్దం, మన్నన.

రాజకీయంగా నాకు వ్యక్తిత్వం కలుగజేసిన చెన్నారెడ్డిగారికి నేను కృతజ్ఞుణ్ని. గవర్నరు నామినీగా ప్రభుత్వాన్ని బలపరచవలసిన వాణ్ని. ఈ రెండూ నాకు నైతిక ధర్మాలు.

కవిగా నేను సర్వ స్వతంత్రుణ్ని.

శాసన సభ్యుడు భీమన్న వేరు. కవి భీమన్న వేరు.

నేను కౌన్సిలు హాలులోకి ప్రవేశించే ముందు నా కవితా సరస్వతిని పౌరోద్యానంలో వదిలేస్తాను. తిరిగి వచ్చేటప్పుడు కూడా తెచ్చుకుంటాను. రాజకీయాలు వేరు, రాగోదయాలు వేరు. రాజకీయ రణగొణలు నా రసానంద సారస్వత మూర్తికి కిట్టవు.

నాకు లభించిన ప్రత్యేక అదృష్టం ఒకటుంది. అధికారపక్ష సభ్యులతోపాటు, ప్రతిపక్షాల సభ్యులు కూడ – కుల మత వర్గ వయో విభేదాలకు అతీతంగా – నన్ను ప్రేమగా చూడటం. వాత్సల్యంతో సహించడం. (నన్ను నిజంగా సీరియస్‌గా తీసుకోకపోవడం అనే ప్రమాదం కూడ ఇందులో వుంది. అది సహజమే మరి.)

## తెలుగు రాజధాని

నాకు కొన్ని లక్ష్యాలున్నై. నేను ఎల్లప్పుడూ, ఎక్కడబడితే అక్కడ ఏకరువు పెడుతూ ఉండేవే ఇవి.

భారతదేశ అధికార భాష తెలుగు కావలసింది. జర్మానిక్ భాషా కుటుంబంలో ఇంగ్లీషు వలెనే, సంస్కృత ద్రావిడ భాషా సమాఖ్యలో తెలుగు సర్వ సమర్థమైన భాష. అధ్యక్షులవారి కాస్టింగు వోటుతో హిందీ అధికార భాష అయింది. అది ఉత్తరాదిది.

పోనీ, దక్షిణాది నుంచి రెండవ స్థానంలోకైనా తెలుగు వెళ్ళవద్దా? ఈ విషయంలో తెలుగు పెద్దలూ, తెలుగు ప్రభుత్వమూ ఇంతవరకూ తీసుకొన్న చర్యలేమిటి?

తెలుగు రాజ్య రాజధానికి తెలుగు పేరు పెట్టాలని పాతికేళ్లుగా గొంతు చించుకొంటు న్నాను. పాళీలు విరగ్గొట్టుకొంటున్నాను. ఇంతవరకు ఫలితం లేదు. బెజవాడను విజయవాడగామార్చిన తెలుగు వీరులు హైదరాబాదును భాగ్యనగరం చెయ్యలేక పోతున్నారేం? పోనీ - గోలకొండ రామదాసు, పొట్టి శ్రీరాములు పేర్లతో "శ్రీరామనగర్" అనవచ్చుగా?

మామాలకు (హరిజనులకు) ప్రత్యేక పేటలు వద్దనీ, ఉమ్మడి కాలనీలు, ఉమ్మడి గ్రామాలు, ఉమ్మడి హాస్టళ్లు ప్రారంభించాలనీ, వాళ్లకు వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహం ఇవ్వా లనీ, పట్టణాలలో స్లంలను తీసేసి, వాటి స్థానంలో బహు అంతస్తుల భవనాలను నిర్మించాలనీ, మామాపేటల వరకు భారతీయ సంస్కృతిని తీసుకువెళ్ళాలనీ, చట్టరీత్యా కులాలను రద్దు చెయ్యాలనీ - వగైరా ఎన్నో సూచనలున్నై నా గ్రంథాల నిండా.

## ఆధునిక జాతీయ విద్య

చతుష్షష్టి కళలంటే వృత్తి విద్యలే కదా? చోరకళ కూడా ఒక కళే. ఆనాడు వృత్తులు అరవై నాలుగన్నమాట. మరి ఈనాడు?

వృత్తినిబట్టి కులం ఏర్పడుతున్నదన్న భగవద్గీతను ప్రమాణంగా తీసుకుంటే - ఈనాడు కులం అనే దెక్కడుంది?

పుట్టుకతో కులం ఏర్పడడమనేది అశాస్త్రీయమూ, అవైదికమూ కదా?

ఈనాటి సాంకేతిక విద్యనే చూడండి. శక్తిని బట్టి ఏ కులం కుర్రవాడైనా, ఏ వృత్తి విద్యనైనా అభ్యసించే వీలు నేడుంది. ఇదే వీలు వేదకాలంలో కూడా వుండేది. అందుకే ఆనాడు ప్రతి విద్యా రాణించింది.

ఆనాడు కులం లేదు. వాస్తవంలో ఈనాడూ కులం లేదు. ఈనాడు కులం

వున్నదను కోవడం హిపోక్రసీ. భ్రమ. కులం మార్పిడిని చట్టబద్ధం చేస్తే, ఈ పీడ తొలగిపోతుంది.

స్వతంత్రంగా బ్రతకగల శక్తిని మానవుడి కిచ్చేది విద్య.

అట్టి విద్య బుద్ధి బలాన్నీ, హస్తకౌశలాన్ని వికసింపజేసేదిగానే కాక, శరీర బలాన్నీ, సాహసాన్నీ, ధైర్యాన్నీ కూడ కలిగించేదిగా వుండాలి, శరీర బలాన్ని బుద్ధి కౌశలంతో ఓడించ వచ్చు. అట్టి విద్యనే ఈ నాటకంలోని నాయిక, ప్రగతి ప్రదర్శిస్తుంది.

ఈ నాటకానికి సంబంధించినంతవరకు స్త్రీ పురుషుల మధ్య వుండే ప్రేమ, కామ సంబంధాలతో నాకు ప్రమేయం లేదు. స్త్రీ తన ఇష్టానికి వ్యతిరేకంగా బలవంతం చెయ్యబడ గూడదు. పురుషుని శారీరక పశు బలానికి స్త్రీ లొంగిపోగూడదు. అట్టి శక్తిని స్త్రీకివ్వాలి.

అన్ని రంగాలలోను స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కలిగించాలి. వాటిని రక్షించుకోడానికి అవసరమైన విద్యలన్నిటినీ నేర్పాలి. కుస్తీ, కరాటే, సాము వంటి విద్యలను కూడ అలవరచాలి.

ఈ నాటకంలో ప్రగతి అన్ని విద్యలను, కళలను నేర్చిన నాయిక. ధనస్వామికం, పారిశ్రామికం, వ్యాపారికం వంటి వ్యవస్థలు ప్రగతిని ఎన్ని అవస్థలు పెడుతూ వస్తున్నాయో సూత్రప్రాయంగా ఈ చిన్న ఇతి వృత్తంలో సూచించబడింది. అన్ని అవస్థలనూ దాటుకొంటూ ఆమె ముందుకు పోతూవుంది.

## "కవి - ప్రగతి - పోలీసు"

"కవికి ప్రగతి, ప్రగతికి కవి" అనేది నా సిద్ధాంతం. కవి అంటే కేవలం కవిత్వం వ్రాసేవాడే కాదు. భావనాశక్తి, సృజనాత్మక శక్తికల ప్రతివాడు కవే నా దృష్టిలో. అట్టి శక్తే మనిషిని ముందుకు కదిలిస్తుంది. కదలిక ఒక క్రమంలో జరగడం ప్రగతి.

అంటే–

కవి ఊహ కార్యరూపం దాల్చడం ప్రగతి. అట్టి రూపం నుంచి మళ్ళీ ఊహ ప్రారంభ మవుతుంది. అందుకే కవినీ, ప్రగతినీ కార్యకారణాలుగా అవినాభావ ద్వంద్వంగా, ప్రేయసీ ప్రియులుగా చిత్రించాను ఇందులో.

ఊహగల ప్రతి ఉత్తమ మానవుడూ పురుషోత్తముడే. మానవ ప్రథమ లక్ష్యం ప్రగతే. నిత్యపురోగామిని అయిన ప్రగతికి సౌఖ్య శ్రేయో భావనా స్రష్ట అయిన కవి నాయకుడు. ఇది ఆద్యంత రహితమైన మానవతా పురోగమనం. ఈ మధ్య వచ్చే స్వార్థపరులంతా అల్పా యుష్క మృణ్మయ పాత్రలు. పుడుతూ, పగిలిపోతూ వుంటై. ప్రగతీ, దానిని ఊహిస్తున్న కవీ నిత్యం సాగిపోయే అమృత పాత్రలు.

చివరలో పోలీసు అధికారిని ప్రవేశపెట్టడం కేవల లౌకికం.

ఎంతటి మతైక, మతాతీత, దక్షిణ, వామ, నియంతృత్వ, ప్రజాస్వామిక, ఆటవిక, నాగరిక రాజ్యాలనైనా తీసుకోండి. ఎన్ని నీతులైనా చెప్పండి. ఎందరు దేవుళ్ళనైనా నెలకొల్పండి. పోలీసు, మిలిటరీ బలం లేకుండా పరిపాలన జరపగలుగుతున్నారా? శాంతి భద్రతలను కాపాడగలుగుతున్నారా?

అధికారం లేకపోతే ఎవడూ ఎవడిమాటా వినడు. అధికారం అంటే పోలీసు బలమే.

నైతిక, దైవిక విశ్వాసాలు మనిషిని క్రమశిక్షణకు కట్టుపరచి వుంచలేవు. నైతిక దైవిక విశ్వాసాల వాస్తవ రూపమే సైనిక బలం. అందుకే పోలీసు అధికారిని ఒక మహాసత్త్వుడైన ఉత్తమ గుణశీల శక్తి సంపన్నుడుగా చూపించాను. ధర్మరక్షకుడుగా తీర్చిదిద్దాను.

ఒక యుగం అంతమైపోయిన శిథిలాల నుంచి ఉద్భవించి, మళ్ళీ అదే అదే వక్ర మార్గంలో పెరుగుతున్న మానవ సమాజాన్ని సరిదిద్దడం ఈ నాటకం లక్ష్యం. దుష్ట శిక్షణతో సమాజం క్షాళితమై, మానవత ఒక ఔన్నత్యాన్ని చేరుకోవడంతో ముగుస్తుంది. ఔన్నత్యం ఇలా కొనసాగి, మానవుడు మహాత్ముడే అవుతాడో, మళ్ళీ మహెంజొదారోలా తిరోగమించి, కాలగర్భంలో కలిసి పోతాడో చెప్పలేం.

మనిషి ఇక తిరోగమించకుండా వుండాలనీ, సర్వజన సమాన సౌఖ్యమే లక్ష్యంగా పురోగమిస్తూ పరమోన్నతుడు కావాలనీ నా ఆకాంక్ష. అందుకే ఎన్నో నూత్న సూచనలు చేస్తూ వుంటాను నా రచనలలో. ఇప్పుడిక్కడ కూడా చేశాను.

## చెన్నారెడ్డిగారి సాహిత్య హృదయం

20-9-78 సాయంత్రం కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయంలో శ్రీమతి హైమవతి వ్రాసిన "పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న" అనే గ్రంథాన్ని

ఆవిష్క రించారు ముఖ్యమంత్రి చెన్నారెడ్డిగారు. ఆనాటి ఆయన ప్రసంగాన్ని యథాతథంగా ఇక్కడ ఇస్తున్నాను.

"ఆరున్నర గంటలకు ప్రారంభం కావలసిన ఈ సమావేశం ఎనిమిదిన్నరకు అవుతు న్నది. నా ఆలస్యానికి క్షమించవలసిందిగా కోరుతున్నాను. ఆలస్యం అవుతుంది, రాలేను అని మొదటే చెప్పాను. మీకాసంగతి చెప్పారో లేదో నాకు తెలియదు. కాని ఆలస్యమైనా ఫరవాలేదు, మీరు రావాలి అని నాకు చెప్పారు. అనేక కార్యక్రమాలను ఒప్పుకున్నప్పుడు సహజంగా ఆలస్యం అవుతూ వుంటుంది. ఆలస్యంగా వస్తే కోప్పడతారు. రాకపోతే తిడతారు.

నేను ఈ పుస్తకాన్ని పూర్తిగా చదవలేకపోయాను కాని అక్కడక్కడ చూశాను. బోయి భీమన్న గారిని నేను చాలాసార్లు చూశాను. వారు ఒక ప్రత్యేకమైన వ్యక్తి అని చెప్పడం అతి శయోక్తి కాదు.

ఆయన శాంత స్వభావుడో, కోపిష్టో నాకు తెలియదు. అహింసను ఒప్పుకుంటారో, హింసను ఒప్పుకుంటారో నాకు తెలియదు. కాని ఈ మధ్య నాతో ఎవరో చెప్పారు హింసపై యుద్ధం చెయ్యాలని ఎక్కడో ప్రబోధించారు అని. అప్పుడు అనుకున్నాను ఆయన పౌరుష వంతుడు కాడని. నిజానికి కవిత్వం రాణించాలంటే అన్ని రసాలూ రసవంతంగా వుండే లక్ష్యాలు కలిగివుండాలి.

చప్పిడి మనుష్యులు వ్రాసే కవిత్వం చప్పగా వుంటుంది. జీవితంలోని అన్ని అనుభవాలూ, సమాజంలో అన్ని దృక్పథాలూ అర్థం చేసుకుని, జీర్ణం చేసుకుని స్థిరమైన భావాలను సమాజంలో ప్రతిబింబించగలిగిన వారే మంచి కవిత్వం వ్రాయగలుగుతారు. కవిత్వమంటే నాకు వున్న ఆలోచన – ఒక ప్రక్క అప్పుడువున్న పరిస్థితులను ప్రతిబింబించడం, మరొక ప్రక్క నూతనమైన దృక్పథం చూపించడం. అవి లేకపోతే ఆ కవిత్వం జీవంలేని కవిత్వం అవుతుంది.

బోయి భీమన్నగారు తమ జీవితంలోని అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, జన సామాన్యాన్ని ఆకర్షించి, నూతన సమాజం నిర్మాణం కావడానికి ఉపయోగించే, ఆనందం పొందే కవిత్వాన్ని అందిస్తారు.

ఆయన గురించి ఆమె చాలా చక్కగా చమత్కారంగా మంచి శైలిలో చాలా ఓపికగా

ఈ గ్రంథాన్ని రచించినందుకు బోయి భీమన్నగారి కంటే ఈమెకే ఎక్కువ అభినందనలు అర్పించాలి. భీమన్నగారికి వుండే శక్తి సామర్థ్యాలను మంచితనాన్ని చాల చక్కగా కూర్పుచేసి ప్రజలకు అందచేయటానికి ప్రశంసనీయమైన కృషి ఆమె చేశారని చెప్పవలసి వుంది.

నిజం చెప్పాలంటే భీమన్నగారితో నాకు వ్యక్తిగతంగా ఎక్కువ పరిచయం లేదు. అయినా ఆయనకు వున్న ప్రతిష్ఠ నాకు తెలుసు.

నేను ఎంత దూరాన వున్నా ప్రతిష్ఠగలిగిన వ్యక్తులను అర్థం చేసుకునే అవకాశం నాకు తగులుతూనే వున్నది.

నేను ఉత్తరప్రదేశ్‌లో వున్నప్పుడు దక్షిణాదిన ఉండే పండితులను అక్కడకు పిలిపించి యూనివర్సిటీల ద్వారా వారిని గౌరవించాలనే పథకం గురించి అక్కడి వారికి చెప్పాను. మొట్ట మొదట కొందరికి అసంతృప్తి కలిగినా తరువాత నేను చెప్పింది వారికి నచ్చింది. హిందీ మాట్లాడే వారితో నేను చెప్పాను. ఇతర భాషలను గౌరవించడం నేర్చుకోవాలి. అది నేర్చుకో నంతవరకూ హిందీ భాషను మేము లక్ష్యపెట్టం అని బాహాటంగా మొరటుగా నిష్కర్షగా చెప్పాను. మీరు అట్టి గౌరవం ఇచ్చినప్పుడే దక్షిణాది ప్రజలలో, వారి హృదయాలలో జాతీయ భాషగా దీనికి స్థానం దొరకటానికి అవకాశం వుంటుంది అని చెప్పాను.

యూనివర్సిటీ కన్న పెద్ద సంస్థ, విద్యా పీఠం ద్వారా భీమన్నగారిని గౌరవించాలని ఆ ఏర్పాటు అక్కడ చేయటం జరిగింది. ఆ విధంగా చేసినప్పుడు చాలామంది సంతోషించారు. యు.పి.లోని కొంత మంది మిత్రులన్నారు, హిందీ పండితులను ఇక్కడకు పిలిపించి గౌరవించ వచ్చు గదా అని. వారు చెప్పింది న్యాయమే. కాని ఇక్కడ నాకు ఊపిరి ఆడడం లేదు. రెండుసార్లు బడ్జెటు సమావేశాలు పెట్టే అవస్థ వచ్చింది. ఇప్పుడు ఇది ఇక్కడ జరుగుతుంటే నాకు అనిపిస్తున్నది, ఇక్కడ మన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ద్వారా దానిని అమలుపరచ టానికి ఎంతవరకూ సాధ్యమవుతుందో పరిశీలించాలి.

కవిత్వం మన రాష్ట్ర సమగ్రతనే గాక దేశ సమగ్రతను కాపాడేటట్లుగా వుండాలి. మన సామాన్య సమస్యలను, మానసిక చింతను దూరం చేసేదిగా వుండాలి. భారతదేశంతో

మనకు ఏమి నిమిత్తం వుంది అనుకుంటే అది పొరపాటు అవుతుంది. భారతదేశం అంటే మన దేశమే. ఢిల్లీలో రాజ్యం పాలించేవారు మన ప్రతినిధులే. ఈ దేశం నాది అన్న భావం కలిగించే కవిత్వం వ్రాయాలి. తెలుగు భాషలో కాస్మోపాలిటన్ తత్త్వం ఎక్కువగా వుంటుంది. సంకుచితత్వం వుండదు. అంటే ఇతర భాషలకు వున్నదని నా ఉద్దేశం కాదు. నాకు మాత్రం తెలుగు భాషలో, తెలుగు మనుష్యులలో, తెలుగు వారి భావాలలో కాస్మోపాలిటన్ తత్వం బాగా వుందని అనిపిస్తుంది.

మొత్తం భారతదేశ సమగ్రతకు తోడ్పడే కవిత్వం వ్రాయాలి. అలాంటి పనిని బోయి భీమన్న లాంటి వారే చేయాలి.

వారిని కౌన్సిల్‌లోనే ఎందుకు పెట్టారని కొందరకు సందేహం కలుగవచ్చు. నామినేటెడ్ మెంబర్స్‌కు ఏ చిక్కులూ వుండవు. మంత్రులకు, రాజకీయ పార్టీల సమస్యలకు పొద్దున లేస్తే పార్టీ మీటింగులు, డిస్కషన్సు, లిమిటేషన్సు అవన్నీ వుంటాయి. నామినేటెడ్ మెంబర్స్ అయితే ఇలాంటి చిక్కులు లేకుండా స్వైరవిహారం చేయవచ్చు.

రాజకీయాలలో ఇటువంటి వారి గురించి చెబుతుంటే రాజగోపాలాచారి గారు గుర్తుకు వస్తారు. రాజకీయాలలో తలదూర్చి, రాజకీయ పార్టీల ద్వారా సేవ చేద్దామనే మాటలేకుండా, తమంతట తాము పైకి ఎగిరి, ప్రపంచాన్ని గూడా పైకి ఎగిరించే శక్తిగల వ్యక్తులు వుంటారు. బోయి భీమన్నగారికి అలాంటి శక్తి కలగాలని కోరుతున్నాను.

బలహీన వర్గాల వారు పైకి రాలేదని అనుకోకూడదు. వారిని పైకి తేవాలనే మాట వుండకూడదు. వారంతట వారు పైకి వస్తారు. మనం మధ్యలో అవరోధాలు కల్పించకుండా వుంటే చాలు. ఇదేదో వారిపై దయాదాక్షిణ్యాలతో చేస్తున్నామని కాదు. మన బాధ్యతను మనం నిర్వహిస్తున్నామనుకుంటే అదే పదివేలు.

బోయి భీమన్నగారు పైకి వచ్చిన వ్యక్తి. అందరూ కవిత్వం వ్రాయలేరు. కవిత్వం అనేది చదువుకుంటే వచ్చేది కాదు. అది సహజంగా రావాలి. పుట్టుకతో రావాలి. పుట్టుకతో అన్నాను గనుక గత జన్మ, కర్మలనే భావాలతో నేను ముడిపెడుతున్నా ననుకోవద్దు.

గ్రామాలు చూస్తే అక్కడివారు అమాయకంగా, నిర్మలమైన మనస్సుతో కన్పిస్తారు. పట్టణాలలోని వారు రంగులు పూసుకున్న వారిగా ఆర్టిఫిషియల్‌గా కన్పిస్తారు. పల్లెటూరి వారు ఏది అడిగినా సూటిగా అడుగుతారు. వారు అడిగే దానిలో హ్యూమన్‌హార్ట్

కన్పిస్తుంది. అలా వుండటం పట్టణంలోని వారికి సాధ్యం కాదు. కాని బోయి భీమన్నగారు అలా వున్నారు. వ్రాయడం, వ్యాఖ్యానం చేయడం. అదేం సామాన్యం కాదు.

నేను పుస్తకం అంతా చదవలేకపోయాను. అవధానిగారు పుస్తకం అంతా చదివి వుంటారు. బహుశా పద్యాలు కంఠస్థం కూడా చేసివుంటారు. వారు గంటల కొలది మాట్లాడ గలరు. నేను చదివినా గంటల కొలది మాట్లాడలేను. అక్కడక్కడా కొన్ని పేజీలు చూసిన దానిబట్టే నేను మాట్లాడుతున్నాను. సమాజాన్ని ఉద్ధరించే నూతన వాతావరణం నిర్మాణం కావాలని మన మందరం కలలు కంటున్నాం. అలాంటి కలలకు ఆకారం కల్పించే శక్తివంతు డిగా బోయి భీమన్నగారు నాకు కన్పిస్తున్నారు.

వారు ఇంకా ఇంకా వ్రాయాలని, ఇలాంటి ఉత్సవాలు అనేకం జరగాలని నేను ఆశిస్తూ వున్నాను. ఈనాడు మనం వివిధ పరిస్థితుల్లో దేశాన్ని నడిపించటానికి ప్రయత్నం చేస్తున్నాం. ఇది సంధికాలం. ముప్పయి సంవత్సరాల క్రితం కూడా సంధికాలం అని అప్పటివారు చెప్పారు. అది వేరు. అప్పటి పరిస్థితుల్లో మనమూ, బ్రిటిష్ వారూ, యుద్ధమూ, స్వాతంత్ర్యమూ అనే ఆలోచనలతో సంధికాలంలో వున్నాం. కాని ఇప్పుడు కూడా సంధికాలంలోనే వున్నాం. ఇప్పుడు కనబడని శత్రువులతో లేని ఉత్సాహం తెచ్చుకుని పోరాడే సంధికాలంలో వున్నాం.

పాత దృక్పథాలను, కొత్త శక్తితో ప్రపంచం ముందు పెట్టవలసిన సంధికాలం ఇది. ఈ కాలంలో ఇటువంటి వ్యక్తులు తమ ప్రభావంతో ప్రజలను కదిలించగలుగుతారు. వీరిని ఈ సందర్భంగా అభినందిస్తున్నాను. వారు తమ కవిత్వంతో ప్రజలలో చైతన్యం, ఉత్తేజం తీసుకురావాలని కోరుతున్నాను. ఇప్పటికే ఆలస్యమైంది. బోయి భీమన్నగారి జన్మదిన సందర్భంలో ఇటువంటి పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం నాకు కల్గినందుకు సంతోషిస్తూ ఈ అవకాశాన్ని కలుగజేసిన పెద్దలందరినీ అభినందిస్తూ సెలవు తీసుకుంటున్నాను.''

## కృతజ్ఞతలు

ఈ కావ్య, రచనకు మొదట్లో స్ఫూర్తి ఇచ్చిన వారెందరో వున్నారు. వారందరికీ పేరు పేరునా కృతజ్ఞత చెప్పటం కష్టం. మనస్సులో అట్టి వారందరికీ నా హార్దికాభివందనాలు చెల్లిస్తున్నాను.

ఏడాదికి కనీసం రెండు గ్రంథాలను ప్రింటు చెయ్యాలనేది నా నియమం. రిటైరైన తర్వాత ఏడాది కొకటైనా ప్రింటు కావాలనుకొన్నాను. నిజానికి నేను రిటైరైన తర్వాతనే, నా జీవితానికి సంపూర్ణ వికాసాన్ని ప్రసాదించింది సరస్వతి. త్వమేవాహంగా నా లో లయమైపోయింది. ముఖ్యమైన ఎక్కువ గ్రంథాలను ఈ లోగడనే ప్రకటించగలిగాను.

" ఏది ప్రకటిస్తున్నారు" అనేది నార్లవారి పరామర్శ ప్రశ్న. నేను ఎప్పుడు, ఎక్కడ వారికి కనిపించినా.

" ఏం వ్రాస్తున్నారని అడుగను, మీరు ఎప్పుడూ ఏదో వ్రాస్తూనే వుంటారని తెలుసు - ప్రస్తుతం ప్రెస్‌లో ఉన్నదేది అనేదే నేను తెలుసుకోవలసింది!" అనేది వారి రెండో వాక్యం, వేసిన ప్రశ్నకు వివరణ.

అయితే తద్విరుద్ధంగా నేను - బొమ్మ, శివాలకలు తర్వాత రెండు సంవత్సరాలపాటు ఒక్క కొత్త రచనను కూడ ప్రచురించలేదు. 1977, 78 సంవత్సరాలలో నా పేరు మీద ఏ రచనా ప్రకటితం కాలేదు.

శ్రీమతి హైమవతి వ్రాసిన నా జీవిత చరిత్ర నిర్మాణంలో వున్న, ప్రకటితమైన సంవత్సరాలవి. ఏ తత్ మహాప్రణాళికా సాఫల్య సమారోహ మహోత్సవంలో తన్మయమై, పరవశమై పడివున్నై - ఆ కాలంలో నేను చేసిన రచన లన్నీ.

ఈ రెండేళ్ళ నాగాను భర్తీ చేసుకోడానికి ఈ సంవత్సరం నాలుగు రచనలైనా ప్రకటించాలనేది నా కాంక్ష. రెండైనా తప్పదు. అందులో ఈ ప్రగతి ఒకటి.

జాతీయ బహుమతి పొందిన "గుడిసెలు కాలిపోతున్నై" కవితా సంపుటి మొదలు బొమ్మ, శివాలకలు నుంచి నా జీవిత చరిత్ర నుంచి రాధతో ఎగ్జిబిషను పునర్ముద్రణ నుంచి ఈ ప్రగతి దాకా కూడా సాహితీ సరస్వతికి కంట్రోలు రేటుకు కాగితం అందజేసిన ప్రభుత్వం వారికి నేను ముందుగా కృతజ్ఞత చెప్పవలసి వుంది.

ఈ గ్రంథమే కాదు. చాలా కాలంగా నా ప్రతి రచన ముద్రణకూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహాయమవుతూ వున్న బాపురెడ్డి, మాలకొండయ్య గార్లకు, సి. అర్జునరావు, డా॥ వై. సింహాద్రిగార్లకు, పార్లమెంటు సభ్యులు కుసుమ కృష్ణమూర్తి, మాజీ శాసన సభ్యులు సైనాల గణేశ్వరరావు గార్లకు, జె.బి. రాజు, జి. అచ్యుతరామరాజు,

డి. ఆర్. కుసుమ వంటి వారికి, ప్రెస్ కాపీ తయారుచేసి పెట్టిన శివ సత్యకు, ముద్రించి పెట్టిన ప్రగతి ప్రెస్ వారికి కృతజ్ఞతాంజలులు.

చిరకాల మిత్రలతో పాటు, ఎప్పటికప్పుడు కొత్త కొత్తవారు వచ్చి చేరుతూవుంటారు నా స్నేహ పరిధిలోకి. అది నా అదృష్టం, సాహిత్యానికి ఇప్పుడు కొంత రాజకీయం కూడా తోడయింది. ఇప్పుడు నా మిత్ర మండలిలోకి వచ్చి చేరిన తారలు అత్యంత దీప్తిమైంత షైనట్టివి. వారందరికి కళ్ళుమూసుకొని కేల్మోడ్పు లర్పిస్తున్నాను.

## మేధావి, కళా పోషకుడు

డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారు ఉత్తరప్రదేశ్ గవర్నరుగా వున్నప్పుడు, ఆయన అధీనంలో 19 యూనివర్సిటీలు వుండేవి. అక్కడికి కొంతమంది తెలుగు కవి పండితుల్ని రప్పించి ఎందుకు గౌరవించకూడదు అనే ఆలోచన వచ్చి, 1976లో దానిని అమలుపరచటం మొదలు పెట్టారాయన.

ఆ సందర్భంలో ఆయన ఉత్తరప్రదేశ్‌కు పిల్చిన దాశరథి, నారాయణ రెడ్డి, యశోదా రెడ్డి, వరదాచార్యులు గార్లతోపాటు నేను కూడ ఒకణ్ని.

వ్యక్తిగతంగా బాగా తెలియకపోయినా, నన్ను కూడ పిల్చి గౌరవించినందుకు ఆయన సహృదయతపట్ల నా హృదయం ఎంతో కృతజ్ఞతతో నిండిపోయింది. ఆనాడే – కాశీలో ఆయన ఆతిథ్యం స్వీకరించినప్పుడే, కాశీ క్షేత్రాలలో ఆనందంగా తిరుగుతున్నప్పుడే – అనుకొన్నాను నేను ఏదో ఒక కావ్యాన్ని చెన్నారెడ్డిగారికి అంకితం ఇవ్వాలని. అది 1976 ఫిబ్రవరి 19, 20 తేదీల నాటి ఉదంతం.

ఆ తర్వాత – 1976, 77, 78లో కొంతవరకు కూడ – నా జీవిత చరిత్ర రచనలోను, ముద్రణలోను మునిగి వుండిపోయాను – రచయిత్రి శ్రీమతి హైమవతికి తోడ్పడుతూ.

ఈ ప్రగతి దృశ్యకావ్యాన్ని చెన్నారెడ్డిగారికి అంకితమిద్దామని నిర్ణయించుకోవడం 1977లోనే జరిగినా, దీని ముద్రణ పూర్తికావడం మాత్రం ఇప్పటికి నెరవేరింది. ఈ

కావ్యం పీఠికలో ప్రచురించడం కోసం నేను వ్రాసుకొన్న వ్యాసం వారి షష్టిపూర్తి సంచికను "సమష్టిమూర్తి" అనే పేరుతో అలంకరించింది. దానిని మళ్ళీ నే నిక్కడ పునరుద్ధరించటం లేదు.

చెన్నారెడ్డిగారి పట్ల నాకుగల గౌరవ కృతజ్ఞతాభి ప్రతిపత్తి అపారమైనట్టిది. నా జీవిత చరిత్రలోను, సమష్టి మూర్తి వ్యాసంలోను, అప్పుడప్పుడు అక్కడ నేను వ్రాసే పద్యాలలోను, చేసే ఉపన్యాసాలలోను దానిని సూత్రప్రాయంగా పరికించవచ్చు - జిజ్ఞాసువులు.

రెడ్డిగారిపట్ల నాకుగల అభినందన పూర్తిగా వ్యక్తిగతమైనట్టిది.

ఆయన మేధావి, మహావక్త, కళాపోషకుడు, సృజనాత్మక భావుకుడు, రాజకీయా లలో ప్రవేశించకుండా వుంటే - ఒక మహాయోగో, బ్రహ్మర్షో అయి వుండేవారు. ఆయన ప్రతిభ, ఆత్మశక్తి అట్టివి.

అందుకే ఈ కావ్యాన్ని ఆయనకు అంకితం ఇస్తున్నాను.

ఇది
చంద్రుడికో నూలుపోగు.

-భీమన్న

## అంకితం

వత్తృమందు మఱ్ఱి, సాహిత్య సౌందర్య
మాధవమున గున్న మావి చెన్ను,
మాన్య ముఖ్యమంత్రి మా మఱ్ఱి చెన్నయ్య!
మహిత శక్తిశాలి! విహిత శూలి!

వృక్ష వర్గమ్ములో వటవృక్ష మట్లు
మంత్రివర్గమ్ములో ముఖ్యమంత్రి నీవు,
జ్ఞానవత్త్వాన విజ్ఞాన చక్షు వట్లు
మానవత్వాన ధర్మ ప్రధాని నీవు!

కార్య శౌర్యమ్ము, వేగమ్ము, క్రమత, శ్రమత
సర్వ సేవానిరతి, సమస్త జన ప్రగతి,
పల్లె పల్లెను విశ్వరూపము ధరింప
జాతి – గీత ద్వయీ సవ్యసాచి నీవు!

సామ్యవాద మంచు, సంప్రదాయ మ్మంచు
స్పర్థ పెంచుచుంద్రు స్వార్థపరులు,
సోషలిజము వేదసూక్తుల లేదొకో?
అమలుజరిపి చూపు మన్న చెన్న!

కాశి లోన తప్ప కాశీ మిఠాయీలు
ఇతరచోట్ల దొరక వెంత కైన,
బహుజ నాభివృద్ధి పథకాల క్షేత్రమ్ము
మాకు నీ చరిత్ర, మఱ్ఱి చెన్న!

మిత్ర శత్రు భావ మిసుమంతయును లేదు,
ప్రజ్ఞ ననుసరించి పదవు లొసగు,
పని యె దైవ మన్న ప్రవచాన పనిచేయు
రాజ్యప్రగతి గతికి రాజ వీవు!

విశ్వ మానవుండు, విశ్వేశ్వ రాత్ముండు,
విశ్వ మత కుటుంబి, విశ్వ సముడు,
మధుర భక్తి రతుడు మర్రి చెన్నారెడ్డి
మామకీన కావ్య కామి యగుత!

ప్రగతి, అభ్యుదయిని, ప్రజాన దీపిక,
విశ్వ జన సమాన, వీర సేన,
పరమ మానవత్వ పథ లక్ష్య దర్శిని,
భవ్యవాణి, నాదు కావ్యలక్ష్మి!

ప్రగతి గామివి నీ వౌట ప్రగతి నొసగి
నిను పతిన్ జేసి, నే పయో నిధినె యౌదు;
నేను కోరున దొక్కటే – నీవు సతము
తెలుగు జన కోటి కోర్కెల వెలుగు వగుము!

భాగ్యనగరం
9–4–1979

బోయి భీమన్న

## పాత్రలు

1. ప్రగతి : పదహారేళ్ల బాలిక – నృత్య గాన కళా విద్యార్థిని. వృద్ధ నైష్ఠికుడు హరప్పా ఈమె తండ్రి. గౌతమీ పుత్ర అనే అజ్ఞాత కవి ఈ మె అభిమాన కవి.

2. మార్గమిత్ర : వివిధ సందర్భాలలో వివిధ వేషాలలో ప్రగతిని అంటి వచ్చే ఒక యువకవి. చివరకు ఇతడే గౌతమీ పుత్ర అవుతాడు.

3. ప్రచార్ : పదవీ స్టుడియోల మేనేజరు. ఫోటోల వ్యాపారి.

4. శ్రీరాం : సాంస్కృతిక రంగంలో ఒక పెట్టుబడిదారు.

5. దొరబాబు : ఒక యువ భూస్వామి. ప్రగతికి బావ వరసవాడు.

6. కృష్ణార్పణం : ఒక పారిశ్రామికవేత్త.

7. అబ్బులు : సంఘ సేవకులు

8. సుబ్బులు : కృష్ణార్పణంగారి ఏజెంట్లు

9. బుద్ధమూర్తి : పోలీసు అధికారి – మార్గమిత్రకు మిత్రుడు.

10. అవసరాన్నిబట్టి ప్రజలు – పోలీసులు

11. గమనిక : ౧. అన్నీ ఉద్యానవన దృశ్యాలే – కొద్ది మార్పులతో
౧౧. హరప్పా, లక్ష్మీ కుమారి, లంకేశం వంటి పాత్రలు రంగం మీదకు రావు.

12. వ్యంగ్యార్థం : ఆకలి నుంచి పనిపుడుతుంది. పని నుంచి పనితనం (ప్రావీణ్యం) పుడుతుంది. ప్రావీణ్యం ప్రగతిగా వికసిస్తూ పురోగమిస్తుంది.

ప్రగతికి తామే నాయకుల మంటూ ధన స్వామికం, భూస్వామికం, పారిశ్రామికం వంటి ఇజాలు విజృభించడం వల్ల ఆయా దశలలో ప్రగతి కుంటుపడుతుంది. నాగరికత శిధిల మవుతుంది.

శిధిలాల నుంచి మళ్ళీ ప్రగతి లేచి ముందుకు సాగుతుంది.

కవి ఒక్కడే ప్రగతికి మార్గమిత్రుడు - ప్రగతి స్వయం చోదకశక్తి.

## దృశ్యం ఒకటి

(ఆర్ష నగరంలో ఒక చివారు. పురావస్తుశాఖ వారి శిల్పవనం. నడుమ ఒక బహిరంగ రంగస్థలం - ముదిచెట్లు, శిధిల శిల్పాలు వగైరా గత వైభవ చిహ్నాలతో ఒక విలక్షణ సౌందర్యం చుట్టుముట్టి ఉంది. రంగవేదిక మీద ప్రేక్షక స్థానాలలో ప్రచార్, శ్రీరాం, కృష్ణార్పణం, దొరబాబు, మార్గమిత్ర మున్నగు వారు ఆసీనులై వున్నారు. తెర తొలిగేటప్పటికి ప్రగతి ఒక పాటకు అనుగుణంగా నృత్యంచేస్తూ వుంటుంది. సభాసదులు యధాశక్తి ప్రశంసా ప్రకంపనాలు చేస్తుంటారు. పాత్రధారిణి విద్యను బట్టి ఈ నృత్యం కూచిపూడి, భరతం, అభినయం, జానపదం ఏదైనా కావచ్చు. పాట కనుగుణమైన పదవిన్యాసం భావ ప్రకటన వుంటే చాలు.)

పాట :

ఎదలో ప్రగతిని ప్రతిష్ఠించు కోరా :
హే, మానవుడా, ప్రకృతి పురుషుడా :

శాంతీ, సుఖమూ వెనుక ముందుగా
సమ సమాజమే కవచముగా
ధన ధాన్యాలే కుడి యెడమలుగా
మనో వికాసమే నవోదయముగా :

కులమూ, మతమూ, వర్గం, జాతి
కృతకం రా : నీ స్థితికి తగవురా :
ఉన్నదేదో మీ అందరు తింటూ
ఉమ్మడిగా ఆనందించరా :

నీతి, నియమం, సిద్ధాంతాలూ
జాతి ప్రగతికే కదరా?
వైర, విరుద్ధ, విషమ ధోరణులను
నిరాకరిస్తూ ముందుకు పదరా :

(నృత్యం ముగిసి, సభకు నమస్కరించి ప్రగతి నిష్క్రమిస్తుంది. సభాసదులు తన్మయత్వంలో మునిగి, తలలూపుతూ, తాళాలు వేస్తూ వుండిపోతారు. మార్గమిత్ర చిరునవ్వుతో లేచి, ముందుకు వస్తాడు. సభాసదుల్ని పరికిస్తూ శిరః కంపన చేస్తాడు)

మార్గమిత్ర :

ఇంత కాలానికి
ఇన్ని వర్గాలవాళ్ళు చేరుకోగలిగారు
ఒకే ఆనంద స్థాయికి :

సాహిత్యాన్ని గ్రహించు
సంగీతాన్ని ఆలకించు
నాట్యాన్ని తిలకించు
ఈ మూడూ కలిసిందే సంస్కృతి :
సంస్కృతిని పోషించినంత కాలం
మానవుడు నాగరికుడు
తన స్వార్థం కోసం
సంస్కృతిని భక్షించదలిస్తే
పర్యవసానం ఇదే - శైథిల్యం

(శిథిల శిల్పాలచేసి చేయెత్తి చూపుతాడు నిరాశ పడతాడు.)

మార్గమిత్ర :

ఆకలి నుంచి పని పుడుతుంది

పని నుంచి ప్రావీణ్యం పుడుతుంది.

ప్రావీణ్యం నుంచి ప్రగతి పుడుతుంది.

అన్నిటికీ మూలం ఆకలి :

ఆకలే ఆదిశక్తి :

ఆకలిని మరిచి

అహంకారాన్ని విరిచి

ఇంతకాలానికి

ఇన్ని ఇజాల వాళ్లు

కలుసుకో గలిగారొకేస్థాయిలో :

సాముదాయక శ్రేయోవాంఛ,

ప్రగతికి బీజావాపం

ఈ సమస్థాయి

ఇలాగే కొనసాగాలి,

గత శైథిల్యం పునాదిగా

వర్తమానం వికసించాలి,

ఉదయారుణ సూర్యరశ్మితో

ప్రగతి పందెం కట్టి నడవాలి :

(ఈలోగా ఒక్కొక్కరూ తేరుకొంటున్నారు. మార్గమిత్ర ఒక్కొక్కర్నీ పేరు పెట్టి ఉద్బోధిస్తాడు.)

మార్గమిత్ర :

ప్రజల ధనాన్ని పోగు చేసుకొని
బంగారు కోటలు కట్టు కొన్న శ్రీరాం :
ఈ మానవ జాతి పునర్నిర్మాణంలో
ఏమిటి నీ పాత్ర :

శ్రీరాం :

(చేతులు మోడ్చి) బంగారు పాత్ర – ప్రజాధనాన్ని పోగుచేసుకొని నేను నిర్మించిన ఈ నాగరికత, అదే ధనం కారణంగా ఎలా శిధిలమైపోయిందో చూస్తున్నాను. కవీ :

మార్గమిత్ర :

(లేచి ముందుకు వచ్చిన దొరబాబుతో)
ఈ నేల అంతా నాదే అంటూ
ప్రజల ధాన్యం అంతా పోగుచేసుకొని
వాళ్ళకు ఏడాది కొకసారి అన్నదానం చేస్తూ
పుణ్యాత్ము డనిపించుకొనే దొరబాబూ :

దొరబాబు :

భగవంతుడి సృష్టి పంచభూతాలలోని ఆకాశం, గాలి ,నీరు, నిప్పు వలెనే – ఈ నేలకూడ ఎవరిదీ కాదు, భగవంతుడిదే అన్న పాఠం ఇంకా నాకు వొంట పట్టదా కవీ :

మార్గమిత్ర :

(కృష్ణార్పణం కేసి తిరిగి, వేలితో నిర్దేశిస్తూ)
పేరులోనే మోసాన్ని దాచి పెట్టుకొని
ప్రజల శ్రమ ఫలితాన్నంతా ఆత్మా
రామార్పణం చేసుకొంటున్న కృష్ణార్పణం :

కృష్ణార్పణం :

బుద్ధుడి భూతదయ, క్రీస్తు పాపక్షమ, మహమ్మదు ఏకేశ్వరత, మార్క్సు సర్వసమత, గాంధీ ధర్మకర్తృత్వం అంబేద్కరు దళితోద్ధరణ, వీటన్నిటినీ కలిపి, ముద్దచేసిన కృష్ణగీత నా పారాయణగ్రంథం. సర్వం మిథ్య అని నాకు వేరే చెప్పాలా, కవీ :

(మెడలో కెమేరా తో - ముందుకు వచ్చేసి) ఈ మానవ పునరుజ్జీవన ప్రణాళికా ప్రగతిని నేను రంగుల చిత్రంగా షూట్ చేస్తాను. ప్రగతి వర్తమాన గతికి సాక్షిభూతంగా వుంటాను. కవీ :

మార్గమిత్ర :

బాగుంది, మిత్రమా, బాగుంది :
ధనం, కృషి, పరిశ్రమ, ప్రచారం
ఈ నాలుగూ నాలుగు చక్రాల రథం :
ప్రగతి పురోగమనానికి పదం :

ఇక వదిలేద్దాం గతం
సమాజసేవే ఇక మన మతం
పరిణామక్రమంలో మరొక మజిలీకి
ఇదే మన స్వాగతం

(మార్గమిత్ర గొంతుతో గొంతు కలిపి అందరూ ఈ చివరి పంక్తుల్ని నినాదాలు పలుకుతూ వుండగా, తెరపడుతుంది.)

## దృశ్యం రెండు

(హరప్పాగారి గృహోద్యానం. "హరప్పా గార్డెన్స్" అనే బోర్డు ఒక మూల ముదిచెట్టుకు వ్రేలాడుతూవుంది. తోట నిండా శిల్ప శిధిలాలు పడి ఉంటాయి. తెర తొలిగేటప్పటికి ప్రచార్ ఫోటోలు తీసుకుంటూ కనిపిస్తాడు. పూలచొక్కా, గిరజాల

జుట్టు. ఎక్కడినుంచో ఒకపాట వినిపిస్తూవుంటుంది. దానికి అనుగుణమైన అడుగులతో ప్రగతి ప్రవేశిస్తుంది. చేతిలోని పుస్తకం పచ్చికమీదకు విసిరేసి, పాటను అందుకొని, లాస్యధోరణితో లతానికుంజాలను పరామర్శిస్తుంది. ప్రగతిని చూచి, ప్రచార్ చాటుకు చాటుకు తప్పుకుంటాడు)

పాట :

రాతి నుంచి రమణీయ శిల్పమా :
మట్టినుంచి మాణిక్య దీపమా :

ఎవరే, ఎవరే, మీరు?
ఇంత శోభ నెట తెచ్చారు?

బురద పొలమె పరమాన్న కలశమా :
పచ్చిక బీడే పాల మీగడా :

ఎవరే, ఎవరే, మీరు ?
ఇన్ని రుచులు మా కిచ్చేరు ?

చేతి వ్రేళ్ళలో సృజనాశక్తీ :
భావ వీధిలో ప్రతిభా దేవీ :
ఎవరే, ఎవరే, మీరు ?
ఇంత ప్రగతి సాధించేరు :

(ప్రగతి అలా ఆడుతూ, పాడుతూ వుండగా ఒక మూల నుంచి కెమెరాను సరిపరచుకుంటూ ప్రచార్ ప్రవేశిస్తాడు – ప్లాష్ కొడతారు, అప్పుడు తలెత్తి చూస్తుంది ప్రగతి, కలవరపడి, ముందుకు వస్తుంది.)

ప్రగతి :

ఏయ్, ఎవరు నువ్వు?

(ప్రచార్ మాట్లాడడు – ఆమెకేసి చూడడు – రెండడుగులు వెనక్కు వేసి, మరో ఫోటోకోసం కెమెరాను సరిపరచుకొంటూ వుంటాడు.)

ప్రగతి :

(మరికొంత ముందుకు వచ్చి)

ఏయ్, నిన్నే : వినపడదా? ఎవరు నువ్వు? ఏమిటీ పని?

ప్రచార్ :

(మరో ప్లాష్ కొట్టి, తలెత్తి, చిరునవ్వుతో) సారీ, మేడం : శిల్పం అనుకొన్నాను. సంపూర్ణ శిల్పాలు సజీవంగా విహరిస్తాయనుకోలేదు :

ప్రగతి :

(చాచి చెంపకాయకొట్టి) తిరగబడి తంతా యని కూడ అనుకోలేదు:

(దెబ్బతో అతడి కళ్ళద్దాలు అంతదూరాన పడతై, అతడు గిర్రున మూడు గిరికీలు కొట్టి నిలబడతారు, చెంప తడుముకొంటూ, చుట్టూ చూచి, కళ్ళద్దాల వద్దకు వెళతాడు, వంగి వాటిని తీసుకొంటాడు, అలా వంగినప్పుడు అతడి జేబులో నుంచి కొన్ని ఫోటోలు క్రింద పడతాయి. వాటిని చూచిన ప్రగతి ఒక్క దూకున వాటిని అందుకుని పరిశీలిస్తుంది.)

ప్రచార్ :

(చెంప తుడుముకొంటూనే) కలియుగం :

ప్రగతి :

(నిర్లక్ష్యంతో) నీ కృతయుగం కూడ ఇంతకంటె బాగా ఏడవలేదులే బాధపడకు

ప్రచార్ :

అనసూయ, సీత, సావిత్రి... (ఇంకా కొన్ని పేర్ల కోసం తల గోక్కుంటాడు.)

ప్రగతి :

(వెటకారంగా) అహల్య, మండోదరి, ద్రౌపది – ఎన్నిసార్లు లెక్క పెట్టినా, ఒక డజను పేర్లకంటే ఎక్కువ లేదు మీ పురాణ సౌభాగ్యం:

ప్రచార్ :

ఇప్పుడు నీతో వాదించలేను. చెంప సలుపుతోంది. ఆ ఫోటోలు ఇలా పారెయ్ : (చెంప తడుము కుంటూ) ఆస్పత్రి మూసేస్తారో యేమో ::

ప్రగతి :

మూసేస్తే పర్వాలేదు. అక్కడికంటె మంచి మందు రోడ్ల మీద దొరుకుద్ది.

ప్రచార్ :

ఆc : ఏమి అది ?

ప్రగతి :

పేడ : బర్రె పేడ : ఈ రోజుల్లో రోడ్లనిండా అవే : నీ ఆరాధ్యదైవాలు :

ప్రచార్ :

నీ సలహాకు థేంక్సు, కాని, కాపడం ఎవరు పెడతారు? ఒంటరిగాణ్ని: జంటకోసం వెతుక్కొంటున్న వాణ్ని :

ప్రగతి :

(తీవ్రంగా) రెండో చెంపకూడా పగలాలా యేం? (మీదికి వెళుతుంది)

ప్రచార్ :

(వెనక్కి గెంతి) అక్కరలేదు.నీవు హరప్పాగారి అమ్మాయివి : నీ చేయి...

ప్రగతి :

(తన చేతిని చూచుకొంటూ) ఈ చేతి మీదుగా పగిలిన చెంపలు పాతికపైనే వున్నై.

ప్రచార్ :

గుండెలు ఎన్ని వున్నాయో :

ప్రగతి :

ఇలా ఆడపిల్లల వెంటబడి వేధించే రౌడీ గాడిదలకు గుండెలు వుండవు చెంపలే వుంటై.

ప్రచార్ :

నాకు రెండూ వున్నై.

ప్రగతి :

అవే, చెంపలు : (చిరునవ్వు నవ్వుతుంది)

ప్రచార్ :

(ధైర్యం తెచ్చుకొని, తాను నవ్వుతూ) నీవు మామూలు ఆడపిల్లవు కాదు. నేను రౌడీ గాడిదనూ కాదు. పోనీ, కాని.... ఫోటోలు ఇలా ఇచ్చెయ్, తొందరగా పోవాలి.

ప్రగతి :

(కోపంగా) ఇవి నీ కెక్కడివి ?

ప్రచార్ :

(ఆశ్చర్యం నటిస్తూ) అవి నీవి కావే :

ప్రగతి :

నావి కాకపోతే, నా ఫ్రెండువి :

ప్రచార్ :

లక్ష్మీకుమారి నీ ఫ్రెండా ?

ప్రగతి :

లక్ష్మీకుమారి.

ప్రచార్ :

అదే, మేమంతా లక్ష్మీకుమారి అంటాంలే ! లాటరీలు కడుతూ ఉంటుంది కనుక, లక్ష్మీలాటరీ కుమారి, ఆమె నీ ఫ్రెండా ? మట్టికీ మాణిక్యానికీ నేస్తమా ?

ప్రగతి :

అవును, నేస్తమే, మాణిక్యమే అరిగి అరిగి మట్టి అవుతుంది. మట్టి నుంచే అన్ని మాధుర్యాలు పుట్టేది. మట్టి లేకపోతే మనుగడే లేదు. ఈ మాణిక్యాల తళుకంతా మట్టి వున్నప్పుడే. (ఆశ్చర్యంగా) గౌతమీ పుత్రలా మాట్లాడుతున్నావేమిటి? అతడి కవితా ధోరణి నీక్కూడా అంటుకొన్నట్టుంది.

ప్రచార్ :

గౌతమీ పుత్ర నీకు తెలుసా :

ప్రగతి :

తెలీదు. అతడి కవిత తెలుసు. అతడి పాటలు నాకిష్టం. అదంతా నీ కెందుకు గాని... లక్ష్మీకుమారి నా ఫ్రెండు. చాలా కాలంగా కనిపించడంలేదు. ఇప్పుడెక్కడుంది? ఈ ఫోటోలు నీ కెక్కడివి? ఎందుకు నీ కూడా తిప్పుతున్నావ్ వీటిని ? బ్లాక్‌మెయిల్ చేస్తున్నావా ?

ప్రచార్ :

(తల గోక్కొని) ప్రతిపక్ష సభ్యుడిలా అన్ని ప్రశ్నలొకేసారి విసిరితే దేనికని జవాబు చెప్పడం ?

ప్రగతి :

మంత్రిగారిలా మాట్లాడకు చెప్పు !

ప్రచార్ :

సారీ, మేడం: నేను చెప్పను. నా కవసరంలేదు – నీ కుంటే మా స్టూడియోకి రా : నా అవసరం లేకుండా నీవు ఒక్క అడుగైనా ముందుకు వెయ్యలేవు. నేను చరిత్ర గతికి సాక్షిని : తెలుసుకో: నెనెప్పుడూ నీ వాణ్నే : (దురుసుగా నిష్క్రమిస్తాడు)

ప్రగతి :

(అనుకోని ఈ హఠాత్సంఘటనలకు చకితురాలై, తేరుకొని, అతడు పోయిన కేసి నుంచి దృష్టిని ఫోటోల మీదకు మళ్ళించి, అటూ ఇటూ త్రిప్పిచూస్తూ) లక్ష్మీకుమారి: ఎంతటి ఔన్నత్యం నుంచి ఎంత కిందకు పడిపోయింది. మాణిక్యం మట్టయిపోయింది. అంతరంగ అమృతభాండం అందరికీ వెయ్యని తలుపూ, తియ్యని విస్తరీ అయిపోయింది · (ప్రచార్ వెళ్ళిన వైపుకు నిష్క్రమిస్తుంది.)

(రెండో వైపునుంచి సాలోచనగా మార్గమిత్ర ప్రవేశిస్తాడు)

మార్గమిత్ర :

లక్ష్మీ కుమారిని నిందిస్తూనే
ప్రగతి ప్రచారం వెంటపోతున్నది :
అయ్యో, ప్రగతీ : ఓ ప్రగతీ :
నువ్వూ గాలి కోడివేనా ?
నీ ఒక్కొక్క చెంపదెబ్బ
ఒక్కొక్క మహా నాగరికతనే
నేల మట్టం చేసిన చరిత్ర నీది :
అసలు ప్లానే సర్వజన శ్రేయంగా
పునాదే సమసమాజ భరితంగా

వుండేటట్టు జాగ్రత్త పడాలి :

ముందే జాగ్రత్త పడాలి, ప్రగతీ :

దుష్టుల్ని పెరగనిచ్చి

శిష్టుల్ని రక్షించ బూనడం వట్టి ప్రయాస :

ప్రగతీ : ఓ ప్రగతీ :

ముందే పునాదుల్ని నిర్దుష్టంగా వేసుకో :

తర్వాత కోటల్ని పడగొట్టడం హింసాత్మకం :

నఖ క్షతంతో పోయే హింసను

కంఠక్షతం దాకా పోనివ్వకు :

గాలి వాటం చూపే పతాకం లక్ష్మీకుమారి.

గాలికోడి కాగూడదు ప్రగతి :

పదవీ స్టూడియోల ప్రచారం

ప్రగతికి పద్మవ్యూహం :

ఎన్ని పద్మవ్యూహాలైనా

ఒక్క ధర్మరాజు అబద్ధానికి సాటిరావు :

వద్దు ప్రగతీ, ఇక వద్దు ప్రయోగాలు :

ప్రయోగాలు పిల్లలకు, మనకుకాదు :

ప్రయోగాలతో కాలయాపనం

సహించలేదిక మానవ నైజం..

ఆగు :

అభ్యుదయం కేసి సాగు :

## దృశ్యం మూడు

(ప్రచార్ స్టూడియోకు ఆనుకొని వున్న తోట. చలన చిత్రాలు తీసే హంగులన్నీ వున్నై. "మాయా గార్డెన్స్" అనే బోర్డుకూడ వున్నదొక మూల. ఒక బెంచిమీద అలసటగా పడివుంది ప్రగతి – కాని ఎక్కడినుంచో ఒకపాట వినిపిస్తూ వుంది. దాని కనుగుణంగా కదులుతూ, కొంత సేపటికి లేచి తిరుగుతూ వుంటుంది.)

పాట :

జారిందే పైట కొంగు, జంగు పిల్లి :
ఊడిందే రైక ముడి, ఊసరవెల్లి :

నీ కళ్ళు
నేరేడుపళ్ళు
నీ వాళ్ళు
గులాబి ముళ్ళు :

కుదిరింది బేరం సందులో
ఎక్కింది దారం సూదిలో
తలకు అండ
మొలకు జెండ
మొగసిరి మొనగాడు
మొదలెడితే గిజిగాడు :

ప్రగతి :

(చెవులు మూసుకొని) మురికి పాటలు : ఎంగిలి ముక్కలు, అతుకుల బొంతలు : పట్టపగలు నడిబజారులో దొంగ సరకు అమ్ముకు బ్రతికే దౌర్భాగ్యులు :

(మరో ప్రక్కనుంచి మరోపాట వినిపిస్తుంది. క్షణం పాటు ఆ పాట విని, మెప్పుతో ముఖం వికసించి, పాటకు అనుగుణంగా లాస్యం చేస్తుంది).

పాట :

ఏది గతి ?
ఏదీ ప్రగతి ?
ఇదిగో....
ఇటు మళ్ళవె జగతీ :

వసంతాగమం గతి
వనమానందించుట ప్రగతి,
సహజాభ్యుదయం గతి
సహజ జాగృతి ప్రగతి :

అవని ఫలించుట గతి, ఫలితం
అందరి కందుట ప్రగతి,
ఆకలి తీరుట గతి, మనుజుని
ఆత్మోత్తేజం ప్రగతి :

వృత్తి ధర్మ కర్తవ్య పాలనం గతి
నృత్యగాన సాహిత్య లాలనం ప్రగతి
స్వజనాభ్యున్నతి గతి
సర్వజన శ్రేయం ప్రగతి :

(అట్టి స్థితిలో ప్రచార్ ప్రవేశిస్తాడు. మరీ షోకుగా అలంకరించుకొని వున్నాడు. ముఖంలో కాఠిన్యం - చేతిలో కాలుతున్న సిగరెట్టు - ప్రవేశించి, క్షణం నిశితంగా చూచి, సరాసరి వెళ్ళి, ప్రగతిచేయి పట్టుకుంటాడు. ఆమె కెవ్వున అరచి, గుంజేస్తుంది, అతడు తూలి పడతాడు.)

ప్రగతి :

(తన చేతిని బాధతో పట్టుకొని) దున్నపోతు

ప్రచార్ :

(తెల్లబోయి) సారీ, మేడం : వెధవ సిగరెట్టు, కాలిందా?

ప్రగతి :

(ఉగ్రంగా) లేదు ముద్దు పెట్టుకుంది :

ప్రచార్ :

(ఉత్సాంతో) ఓహ్ : అది మన సిగరెట్టు మరి : ఏదీ ? ఎక్కడ ? (చూడడానికి ఆమె చేయి అందుకో బోతాడు)

ప్రగతి :

ఇక్కడ : (చేయెత్తుతుంది)

ప్రచార్ :

ఓహ్ : (వెనక్కు గెంతుతాడు)

ప్రగతి :

ఎందుకు నా వెంట పడ్డావ్. ప్రచార్ : నేను లక్ష్మీకుమారిని కాదని చెప్పలే :

ప్రచార్ :

చెత్త లక్ష్మీకుమారి : కోతిముండ : దాన్ని చిత్రాలలో చేర్చాలని ఎన్నో పాట్లు పడ్డాను. ఎన్నో ఫోజుల్లో ఫోటోలు తీశాను. ఏదీ పనికిరాలేదు. అటు ఇంటి నుంచి పారిపోయి వచ్చింది. ఇటు ఏ కళకూ చెందలేకపోయింది. లక్కు పేరులో వుంటేనేచాలదు,

మేడం: ప్రవర్తనలో కూడా వుండాలి. తనకు లేదని ఏడ్చి ఒక కన్నూ, మరొకళ్ళ కున్నదని ఏడ్చి రెండోకన్నూ పోగొట్టు కొన్న మూర్ఖురాలామె. నీ మీదెప్పుడూ విషం కక్కుతూ వుండేది...

ప్రగతి :

నా మీద :

ప్రచార్ :

అవును, నీ ముందు తాను దివిటీ ముందు దీపం అట : తన రంగంలో నీవెక్కడ ప్రవేశిస్తావో అని భయపడుతూనే వుండేది. భయపడేకొలదీ శనివెంట బడుతుంది. అంతేగా, మేడం ?

ప్రగతి :

ఏమైనా ఆమె నా నేస్తం. ఇప్పుడెక్కడుంది ?

ప్రచార్ :

ఏమో, ఎక్కడుందో, ఒకరాత్రి ఎవరో వచ్చి తీసుకుపోయారు– అంతే అప్పటినుంచీ పత్తాలేదు.

ప్రగతి :

పాపం శక్తికి మించిన సాహసం !

ప్రచార్ :

కాదు, ఆమెలో అవి రెండూ లేవు. అందంకూడా లేదు. అది వట్టి గాలి – భ్రాంతి. పట్టుకోవడానికి కాదు. కెమెరాకు దొరకదు – కళా కాంతిలేని మొఖం.

ప్రగతి :

కళాకాంతి కెమెరా కోసం కాదు.

ప్రచార్ :

కెమెరా పట్ట గలిగిందే అందం, మేడం : మరి నా కెమెరా నిన్ను పట్టెయ్య లేదా ? (జేబులో చేయి పెట్టుకుంటాడు.)

ప్రగతి :

నా అందం కెమెరా కోసంకాదు – అది నాది – నా కోసం – నా ఆనందం కోసం – ఈ చర్చంతా దేనికి కాని, ఏవీ, నా ఫోటోలు నా కిచ్చెయ్ నా లక్ష్యం నీ స్టూడియో కాదు. (చేయి చాపుతుంది.)

ప్రచార్ :

(ఆమె చేతిని దూరం నుంచే పరిశీలించి) ఓహో, ఆ రేఖలు ఏదీ సరిగ్గా చూడనీ: నీ చేతిలో లోక విప్లవం వుంది. ప్రగతి : (చేతిని అందుకో బోతాడు.)

ప్రగతి :

(చేతిని వెనక్కు లాక్కుని) ఏం : చిలకమ్మ జోస్యం చెపుతున్నావా అలాంటి కుతంత్ర విచిత్రాలతో నన్ను మాయ చెయ్యలేవు. ఇలాతే ఫోటోలు (ముందుకు వెళుతుంది)

ప్రచార్ :

(వెనక్కి తగ్గి) మాయ లేకపోతే అవి చిత్రాలు కావు, కుతంత్రం లేకపోతే జనాన్నీ ఆకర్షించవు. ఎర లేకపోతే చేప పడుతుందా? అదంతా సంపాదన శాస్త్రం. నీ కర్థంకాదు కాని, నీ ఫోటోలు చూశావా ? వార పత్రికల ముఖ చిత్రాలకు, స్నో పౌడర్ల ప్రకటనలకు, ఇంకా ఎన్నిటికో లక్షలు కురిపిస్తాయి, ఎంతో మంది ఫోటోలు తీశాను గాని, ఇంత సర్వసుందరంగా ఏవీ రాలేదు, నా కళలో నాకిది ప్రగతి : మన అనుబంధం అలాంటిది, జన్మాంతర సౌహృదాని అన్నాడు బాపురెడ్డి.

ప్రగతి :

(నవ్వి) కాళిదాసు :

ప్రచార్ :

ఎవరో ఒకరు - కవి ఎవరైనా, కొటేషను ముఖ్యం, ప్రధానం వాక్కు వక్తకాదు, స్టూడియోలోకి పోదాంపద : (చేయి అందుకో బోతాడు)

ప్రగతి :

(చటుక్కున, వెనక్కి జరిగి) నీ చనువే నా కర్థం కావడంలేదు. మిస్టర్, నీవు గోముఖ వ్యాఘ్రానివి, నీ పంజా కిందకు మళ్ళీ రావడానికి, నేను పంచతంత్రం లోని గాడిద ననుకోవద్దు.

ప్రచార్ :

(పకా పకా నవ్వుతాడు)

ప్రగతి :

ఏమిటా వెధవ నవ్వు ?

ప్రచార్ :

(మరీ నవ్వుతూ) వెధవా - గాడిదా బాగుంది. అచ్చమైన తెలుగు నుడి కారం

ప్రగతి :

అది నువ్వు నీ స్టూడియో కలిసిన జంట : ఇక, దయచెయ్ :

ప్రచార్ :

(సీరియస్‌గా) నీవు లేకుండానా ? అది జరగని పని ప్రగతీ : 'నా మాట ఒక్కటి విను - నీ పేరు ప్రగతి. నే పేరే బీరు ఎవరికైనా, నాకూను, అదలా వుంచు, నీవు సార్థక నామధేయనివి కావాలి. గొప్పదానివి కావాలి. అదీ నా కోరిక, ప్రగతికి స్థానం హరప్పా శిథిలాలు కాదు. అవి దానికి జన్మస్థానం కావచ్చు. అది అక్కడే వుండిపోకూడదు. ముందుకు సాగాలి, వికసించాలి, ఫలించాలి-

(అప్పుడు తెరలోనుంచి ఈ మాటలు వినిపిస్తై - అది మార్గమిత్ర గొంతు)

తెరలోనుంచి :

మళ్ళీ అది శిధిలం కాకూడదు
చరిత్రనుంచి పాఠం నేర్చుకోవాలి,
మానవుడు మరొకసారి
భూభారంగా మారకూడదు :

(ఇద్దరూ శ్రద్ధగా ఆలకిస్తారు.)

ప్రచార్ :

పాపం, ఎవరో వచన కవి :

ప్రగతి :

ఆ పాపం నీ కెందుకులే - ఇంతకూ - ప్రగతి ఫలించడానికి నీ స్టూడియోలోకి ప్రగమించా లంటావు ?

ప్రచార్ :

తప్పదు.

ప్రగతి :

నీ పక్కన నిలబడి ఫోటోలు తీయించుకోవాలి.

ప్రచార్ :

అవును.

ప్రగతి :

(తీవ్రంగా) ప్రతి కోతిముండా తాను రంభో, ఊర్వశో అనుకుంటుంది. ప్రతి కొండముచ్చు వెధవా తాను నవమన్మధుణ్నే అనుకుంటాడు, వాళ్ళూ నీ స్టూడియోలోకి ఎగబడే వాళ్ళు, నాకు కావలసింది ఏ కాంతమూ, ప్రశాంతమూ...

ప్రచార్ :

ఏకాంతం ప్రగతికి కాదు - ప్రగతి కామ్ములంతా పబ్లిసిటీ కాములే.

ప్రగతి :

చాలించు. ప్రగతికి కావలసింది ధ్యానమూ, దర్శనమూ, తదవ లంబమూ.

ప్రచార్ :

నేటి రాజకీయమంతా...

ప్రగతి :

ఏ రాజకీయమైనా ప్రగతి నిరోధకమే.

ప్రచార్ :

నీ మీద ఆశపెట్టుకుని లక్ష్మీకుమారిని వదలుకున్నాను.

ప్రగతి :

గంగలో దిగు :

ప్రచార్ :

నీ భవిష్యత్తు నా గుప్పెట్లో వుంది.

ప్రగతి :

నేను రాజకీయం కాదు.

ప్రచార్ :

(అప్పటికే తనచేతి లోకి తీసికొని ఉన్న ఫోటోను చూపుతూ) దీన్ని ఏమంటావ్ ?

ప్రగతి :

(ఉగ్రురాలై, మెరుపులా దూకి, దాన్ని లాగుకొని, పరిశీలించి) ఏమిటిది? ఎలా తీశావు దీన్ని ? మనిద్దరం కలిసి ఫోటో ఎప్పుడు దిగాం ?

ప్రచార్ :

అదంతా దైవికం, అదలా అమిరిందంతే :

ప్రగతి :

అమిర్చావు : పట్టి అతికావు : అవునా ? ఛీ దుష్టుడా (ఫోటోను చించి పారేస్తుంది)

ప్రచార్ :

చించేస్తే పోయే రూపాలుకావు మనవి, వాటికి వెనక నెగిటవ్ లుంటై. వాటికి నకళ్ళు దిగుతుంటై. అవి మీ నాన్నగారి దాకా కూడ పోతై, ఆలోచించుకో.

ప్రగతి :

(కోపోద్రేకంతో) ఏమన్నావ్ ? (పెడీ పెడీ కొడుతుంది, అతడు తూలి పడిపోతాడు)

(ప్రచార్ పడిలేచే సమయంలో శ్రీరాం ప్రవేశిస్తాడు. ఒక ఆధునిక నవ ధనవంతుడి వేషం. దాష్టీకం కనబరిచే ప్రవర్తన, గంభీరంగా నవ్వుతూ వుంటాడు. చేతిలో నవరంగుల నడక కర్ర.)

శ్రీరాం :

(ఆగి, తల పంకించి) కొత్త పిక్చరా ఏమిటోయ్ ? రిహార్సలా ? షూటింగేనా? బ్రహ్మాండంగా వుందోయ్ : (ప్రగతితో) బహుగొప్పగా చేశావయ్యా : క్రైట్ నాచురల్ : మోస్ట్ బ్యూటిఫుల్, కొత్తతార కొత్తతారే : (పరిశీలనగా చూచి) హోరి, నీ, హరప్పా కూతురువి వావటమ్మా ?

ప్రగతి :

(తుళ్ళిపడి, తూలి, పక్కచెట్టుకు ఆనుకొంటుంది.)

శ్రీరాం :

కళ్ళు తిరుగుతున్నాయా ఏమే ? ఇలా కూర్చో : (ఆమె చేయిపుచ్చుకొని, పక్క బెంచీ మీద కూర్చోబెట్టి, తానుగూడ కూర్చుంటాడు.) ఈమె నాకు తెలసిందే లేవోయ్, ప్రచార్ : నేను తీసుకువెళ్ళి అప్పచెబుతాను గాని, ఇక నువ్వు వెళ్ళు :

(ప్రచార్ చేసేదిలేక, కోపం దిగమింగుకొంటూ నిష్క్రమిస్తాడు. ప్రగతిలేచి ముందుకు వస్తుంది. శ్రీరాం ఆమెను అనుసరిస్తాడు.)

శ్రీరాం :

ఆఁ : నీ పేరేమిటే ? అన్నట్టు, హంస కదూ ?

ప్రగతి :

(జంకుగా) అవును :

శ్రీరాం :

(అనుమానంగా) మొన్న శిల్పవనంలో డాన్సు చేసిన పిల్ల --- ప్రగతి-

ప్రగతి :

నే నే.

శ్రీరాం :

అనుకున్నానులే. మీ నాన్నకు తెలీదు. తెలియక్కరలేదులే. అదొక మూర్ఖ నిష్ఠ. ఇంతకీ, వీడివలలో ఎలాపడ్డావు : పెళ్ళాడతా నన్నాడా యేమిటి ఖర్మ ?

ప్రగతి :

అదేం కాదు

శ్రీరాం :

వీడొక లుచ్ఛాలే. పెద్దపోజులు పెడతాడు ఈ స్టూడియో మనదే. ఆ కెమేరా కూడ మనం కొని ఇచ్చిందే.

ప్రగతి :

ఈ ఎస్టేటంతా మనదే అన్నాడే :

శ్రీరాం :

అంటాడు : సార్థకనాముడు : వాడు నా ఏజంటు. నిజానికి ఈ దేశంలో సాంస్కృతికరంగం అంతా మన చెప్పుచేతల్లోవాళ్ళే. మనం లేకుండా ఏ ప్రోగ్రామూ నడవదు. నీకేం భయం లేదు - ఏ లెవల్లో కావాలంటే ఆ లెవల్లో పెడతాను. నాక్కావలసింది మెరిట్.

ప్రగతి :

నా క్కావలసింది...

శ్రీరాం :

నాకు తెలుసులేవే. వచ్చేనెలలో ప్రపంచ పర్యటనకు పోతున్నాం. మా ఆస్థాన కళాకారిణి లక్ష్మీకుమారి, నీవు సరే అంటే దాని స్థానం నీ కిస్తాను. (తెరలో కారు హారను) శుభం. కారుకూడ వచ్చేసింది : పద :

(శ్రీరాం చేయి చాపగా, ఆమె చేయి ఇవ్వకుండానే వెంట నడుస్తుంది - వెనక్కితిరిగి చూస్తూ రంగం రెండోచివర మార్గమిత్ర కనిపిస్తాడు. అతణ్ని చూస్తూనే ఆమె నిష్క్రమిస్తుంది. మార్గమిత్ర ప్రశాంతంగా ముందుకు వస్తాడు.)

మార్గమిత్ర :

తాను నీడ నిస్తున్నది
శిష్టుడికో, దుష్టుడికో
మఱ్రిచెట్టుకు తెలుసా ?

తన పాట వింటున్నవాడే
తనకేసి తుపాకి గురి పెట్టాడని

కోకిలకు తెలుసా ?

తన నీళ్ళే తనను ఉబకేసి

గట్లు తెంచి గ్రామాలను ముంచుతాయని

నదీమ తల్లికి తెలుసా ?

తన సహజ కవితలను దొంగిలించి

చించి అమ్ముకునే వాళ్ళు పుడతారని

ఆదికవి వాల్మీకికి తెలుసా ?

ప్రగతి : ప్రగతి : ఓ ప్రగతి :

సర్వజనానంద భగవతీ :

ఇదా నీ గతి ?

## దృశ్యం నాలుగు

(నృత్య కళావనం, పాతకాలపు నర్తనశాల చుట్టూ కొత్తగా పెంచిన విదేశీ పూలతోట అది - నిద్రలేమిని సూచించే కన్నులతో అలసటగా పడి వుంది ప్రగతి - ప్రభాత సమయం. అంతకు ముందు నుంచే ఒక పాట వినిపిస్తూ వుంది. పాట సాగే కొలదీ ప్రగతి లేస్తూ, తేరుకొంటూ వుంది.)

పాట :

కలల లోనే జీవించేనా ?

కలల నుంచి మేల్కోనా ?

కలల తుడిచీ, కళ్ళాపు చల్లీ

విరినై, సిరినై విరియనా ?

కలలను నులిపి, కళలుగ నిలిపి

కలకాలము మనలేవా ?

శిలయే నీవా ? శిల్పము కావా ?

గతిలో ప్రగతిగ పద మిడవా ?

కలలే కళలై, ఉలులే పులులై

శిధిలాలయమై చెదరిపోదువా ?

మనిషివి కావా ? మధువులు తేవా ?

జాతికి జీవన మీవా ?

ప్రగతి :

(ఉత్సాహంగా) అలా వుండాలి పాటంటే : బ్రతుకునూ, భావననూ కలిపే మధు ధారలా వుండాలి. ఒక్క గౌతమీపుత్ర మాత్రమే అలా వ్రాయగలడు. జీవితం కల కాదని ఇప్పుడిప్పుచే అనుభవంలోకి వస్తూవుంది: నన్ను కళా దేవతగా ప్రపంచ సింహాసనం మీద కూర్చో పెడతామంటూ నా వెంట పడ్డ ఈ మానవ సింహాల కోరలనుంచి బ్రతికి బైటపడడమెలాగో తెలియటం లేదు. బల ప్రయోగం ఎంతకాలం : ఈ కళారాధకులంతా కామారాధకు లేనా? అందుకే నేమో మానవుడు దైవత్వాన్ని కెదగడం లేదు : (హఠాత్తుగా ఉలిక్కిపడి, ఎదరకు చూచి, భయంతో) అమ్మో : పులి : పులి : (వెనక్కి తప్పు కొంటుంది.)

శ్రీరాం :

హంసా : హంసా : (దురుసుగా ప్రవేశిస్తాడు).

ప్రగతి :

ఆc : (అంటూ ముందుకు వస్తుంది. ఆమె కాలు శ్రీరాం కాలుకు తగిలి అతడు ధామ్మని ముందుకు పడతాడు)

ప్రగతి :

(నవ్వాపుకొంటూ) సారీ, శ్రీరాం గారు :

శ్రీరాం :

(లేచి, దులుపుకొంటూ) హారి నీ, కరాటే నేర్చా వేమిటే ?

ప్రగతి :

అదేమిటండీ ? కాబరే లాంటిదా యేమిటి ?

శ్రీరాం :

కాబరే అంటే డాన్సు. కరాటే అంటే కుస్తీ. ఒకటి పడమటి నుంచీ ఒకటి తూర్పునుంచీ మన దేశానికి వచ్చాయి.

ప్రగతి :

ఏదీ మన సొంతం కాదన్నమాట :

శ్రీరాం :

ఆఁ : ఏముంది మనకు సొంతం ? అయినా, మనం సొంతం చేసుకోని దేముంది ? మనం బ్రహ్మ వాదులం కదా ? బాబా గారు చెప్పారు. నువు రాత్రి ఆ పానీయం కాస్త పుచ్చుకోలేదు కాని, కాబరే ఎంత బాగా చేసే దానివి.

ప్రగతి :

(వికటంగా) పానీయంతో వచ్చేది పర్వర్షనే కాని, పారవశ్యం కాదు, మహాశయా : అయినా ..... నాకెందుకో అభారతీయ మయిందేదీ అందంగా కనిపించదు. ఆనందం కలిగించదు.

శ్రీరాం :

హారి నీ : హరప్పా కూతురనిపించావే : నీ శిథిల సంస్కారమూ, నీవూనూ : అభారతీయం గిట్టదా ? మరి నీవిప్పుడు ప్రయోగించిన కరాటే విదేశీ కాదా ?

(అప్పుడు దొరబాబు రంగంలోకి ప్రవేశిస్తాడు, షరాయి, లాల్చీ, కళ్ళద్దాలు వగైరా ఆధునిక యువక వేషం – చేతిలో పత్రిక.)

దొర :

కాదు, రాం గారు, మీ కాలరీలు, మా కరాటేలు, మన పిల్లల మినీ డ్రెస్సులు, మధువులూ... ఏవీ అభారతీయం కావు, మన చిత్ర శిల్పాలనూ, వేద పురాణ కావ్య సాహిత్యాలనూ పరిశీలించండి.

శ్రీరాం :

(ఇబ్బందిగా ) హారి నీ,

దొర :

మీ పిలకా పంచె కట్టూ కుమార రత్నం ఇంగ్లాండుకు వెళ్ళి, హేటూ, సూటూతో దొరబాబై వస్తే .... వాడు విదేశీ అయిపోతాడా ?

శ్రీరాం :

హారి నీ : నిజమేనోయ్, నిజమే : మన దేశం ముడిసరుకే అటూ ఇటూ పోయి, ముక్కూ మొగమూ దిద్దుకొని, తిరిగి వస్తుంటుంది. మా బంగళాలో లక్ష్మీ లేదూ : అది జపాన్‌లో తయారై, అమెరికాలో అమ్మగా, మా వాడు కొనుక్కొచ్చిన పటమే : సరేకాని... (ప్రగతితో) స్టూడియోకి వస్తావుగా ? (దొరతో) ఈమెను మా కల్చరల్ ట్రూపులో చేర్చుకున్నాంలే. మీ రిద్దరూ కలిసి రండి. (నిష్క్రమిస్తారు.)

దొర :

(అతడు వెళ్ళిన కేసి, ప్రగతి కేసి, తన చేతిలోని ఫోటో కేసి మార్చి మార్చి చూస్తు) ఇదన్న మాట నీ వ్యవహారం, ఇందుకన్నమాట మీ నాన్న నిన్ను ఇంట్లో నుంచి గెంటి వేస్త ?

ప్రగతి :

(కోపంగా) నన్నెవరూ గెంటి వెయ్యలేదు. నేనే వచ్చేశాను. (నిర్లక్ష్యంగా పూల కంచె కేసి నడుస్తుంది.)

దొర :

నేను కళ్ళార చూడక పోతే, నమ్మే వాణ్ని కాదు.

ప్రగతి :

(రోషంగా) ఏమి చూశావు కళ్ళారా ?

దొర :

బుకాయించకు, హంసా, నేనే కాదు చూస్త, ఈ ఫోటోలోది నీవు కాదా? ఎంతో చదువు తావనీ, గొప్పగా పెరుగుతావనీ నీ తల్లిదండ్రులు కలలు కంటుంటే, నువ్వు చేసిందేమిటి ? ఓ కులం కాని కొండ ముచ్చు వెధవతో లేచిపోతే, మేమంతా ఏం కావాలి ?

ప్రగతి :

(ప్రతి అక్షరాన్నీ ఒత్తి పలుకుతూ) పోనీ, స్వకులం నకులం వెధవతో లేచి పోవచ్చా ?

దొర :

(ఉక్రోషంతో) ఏ మన్నావ్ ? నన్నే..

ప్రగతి :

నిన్ను కాదు బావా, లోకం గురించి మాట్లాడాను. ప్రతివాడూ కుల మతాలను స్వార్థానికి వాడు కుంటాడు. అది నాకు కిట్టదు. తాను చేస్తే నీతి, అదే మరొకరు చేస్తే అవినీతీ కాకూడదు. ఇంతకూ మిరంతా నన్ననేది ఆ ఫోటో గురించేనా ? అది వట్టి ఫోర్జరీ, దగా, ద్రోహం...

దొర :

ఆపు, ఆపు, నువ్వనే దగా అన్నీ మన బలహీనతలను బట్టి జరుగుతాయి. రాత్రంతా వాడి స్టూడియోలో నువ్వు కాబరే డాన్సు చేయ్యలేదా?

ప్రగతి :

లేదు, పైగా కరాటే లేన్సు ప్రయోగించి, తన్ని మరీ వచ్చాను. నాన్న నన్ను అపార్థం చేసుకున్నాడు.

దొర :

అప్పటికే ఈ ఫోటో చూచి వుంటాడు. ప్రచార్ గాడే దీన్ని పంపి వుంటాడు.

ప్రగతి :

సొంత వాళ్ళను నమ్మక, పరాయి వాళ్ళను నమ్మే తల్లిదండ్రులు..

దొర :

తల్లిదండ్రులంతా అంతే. అదొక మూర్ఖ జాతి, వీధిలో వెలుగుకు శంకుస్థాపన చేస్తూ, ఇంట్లో చీకటిని వ్యవస్థాపించే ధూర్తులలో మీ నాన్నది మరీ అగ్రస్థానం, అయితే, హంసా, నీ తత్వం తెలిసిన మేము నమ్మం అనుకో, లోకం ఏమనుకొంటుందో ఆలోచించావా ?

ప్రగతి :

లోకాన్ని నేను లెక్క చెయ్యను.

దొర :

మేం చెయ్యాలి. సమాజంలో బ్రతకాలిగా, తప్పదు, సరేగాని, ఇప్పుడు నువ్వేం చేస్తావ్ ? నీడలేని ఆడదాని పట్ల పిల్లి కూడ పులిలాగే ప్రవర్తిస్తుంది. తెలుసుగా ? మీ నాన్నకు కోపం తగ్గే వరకు మా ఇంటికి రా పోదాం.

ప్రగతి :

(హేళనగా) ఏ ఇంటికి ?

దొర :

నీ ఇష్టం, ఏ ఇంటికైనా సరే, ఇప్పుడన్నీ ఖాళీగానే వున్నై.

ప్రగతి :

పులి కోరల నుంచి తప్పుకొని, సింహం నోట్లో దూరి నట్టవుతుంది. వద్దులే, బావా థేంక్సు.

దొర :

పాపం, ఆడవాళ్ళు.

ప్రగతి :

ఏం ? ఎందుకు ? మగవాళ్ళకు లేని పాపం ఆడవాళ్ళ కేం వచ్చింది?

దొర :

మగవాళ్ళను పులులూ, సింహాలూ అను కొన్నంత కాలం మీ ఆడవాళ్ళు గొర్రెలూ, బర్రెలూగానే వుండి పోతారు. మీ దృక్పథంలో మార్పు రానంతకాలం మీ పరిస్థితిలోనూ మార్పురాదు. మగవాడు మహాచేయగలిగిందేముంది ? శారీరకమైన బల ప్రయోగం, అంతేగా ? ధైర్యమూ, కయుక్తికల స్త్రీ ఆ మాత్రం దౌర్జన్యాన్ని సులువుగా ఎదిరించ గలదు. మరి, మగవాడంటే అంత బెదురెందుకు ? అది నిజమైన భయమో, వట్టి నటనో అర్థం కాక – స్త్రీ బెదిరే కొలదీ పురుషుడు విజృంభిస్తాడు. మగవాళ్ళ అఘాయిత్యాలకు తొంభై శాతం కారణం ఆడవాళ్ళ బెదురే.

ప్రగతి :

నీ మాటలో నిజం లేకపోలేదు, బావా : పెళ్ళికి తప్ప తాము మరెందుకూ పనికి రామని ఆడవాళ్ళనుకొంటారు. వాళ్ళను అలాంటి సరుకుగా తయారు చేసింది

మగవాళ్ళేగా ? ఇప్పుడిప్పుడే పరిస్థితి మారుతున్న దనుకో. పూర్తిగా మారే వరకైనా జాగ్రత్త అవసరంగా ?

దొర :

మనిద్దరిదీ ఒకే జాతి కాదా ? నేను సింహాన్నైతే, నీవు లేడి పిల్ల వవుతావా?

ప్రగతి :

జాతి భేదం లేదు కాని, లక్ష్య భేదం వుంది.

దొర :

నేను పెళ్ళైన వాణ్ని కూడ.

ప్రగతి :

పెళ్ళైన వాళ్లే ఎక్కువ ప్రమాదకరం, బావా: ఇంద్రుడు, రావణుడు, సైంధవుడు,కీచకుడు వగైరా ప్రసిద్ధ దుష్టులంతా పెళ్ళైనవాళ్ళే. బేచలర్‌ని యాభై శాతం నమ్మవచ్చు. వివాహితుణ్ని నూరుశాతం నమ్మ గూడదు.

దొర :

(అసహనంతో) మీ నాన్న నీ కిచ్చిన స్వేచ్ఛ ఎంత ?

ప్రగతి :

బంధం వేసిన ఆవుదూడ కిచ్చినంత.

దొర :

నువ్వు దాన్ని దుర్వినియోగం చేశావు, అవునా ?

ప్రగతి :

(నవ్వి) బంధం తెగక బోర్లాపడ్డాను, సరేనా ? ఇక నీవు వెళ్లు.

దొర :

నువు లేకుండానా ? ఇంపాస్సిబుల్ – నిన్ను తీసుకునే వెళతాను. ఇంటికైనా, మింటికైనా.

ప్రగతి :

ఆ రెండు చోట్లకూ నీతో రాను నేను. నా స్థానం ప్రజల మధ్య, నా కళా కాంతులు ప్రజల కోసం.

దొర :

మీ నాన్న నిన్ను వదిలేశాడు, నీకు మీ ఇంట స్థానంలేదు. బైట రక్షణ లేదు. ప్రజలు నిన్ను వాడుకుంటారే కాని, నీకు సహాయపడరు. నేనే ఇప్పుడు నీకు గార్డియనుని.

ప్రగతి :

అక్కరలేదు. ఒక ఆదర్శం కోసం బహిరంగంగా వీధిలో నిలబడ్డ వ్యక్తికి రక్షణ కల్పించలేని సమాజం వట్టి స్మశానం. మీ సామాజకులంతా రాబందులు కావచ్చు. నేను మాత్రం శవాన్ని కాదు. గుర్తుంచుకో.

దొర :

నీ భారం నా మీద మోపారు మీ నాన్న.

ప్రగతి :

ఓహో, ఇప్పుడు నువ్వు భారవాహివయ్యా వన్న మాట.

దొర :

(రోషంతో) ఏమిటి మరీ బరి తెగించి పోతున్నావ్ ? చూడు నిన్ను బలవంతంగా – (చొక్క జేబులు మడుస్తూ, ఆమె మీదకు దూకుతాడు)

(అట్టి స్థితిలో ఒక వైపు నుంచి మార్గమిత్ర రెండో వైపు నుంచి కృష్ణార్పణం ప్రవేశిస్తారు. ఒకరినొకరు చూచుకొని టక్కున ఆగిపోతారు. రంగంలో నలుగురూ బొమ్మల్లా నిలబడి పోతారు, వెలుగు నీడల రంగులు ప్రశ్నార్థకాలై కలత పడతై)

మార్గమిత్ర :

(కదిలి, ఆడియన్సు కేసి తిరిగి)-

సారీ, క్షమించాలి:
ప్రగతి పథం ఇంకా
క్లైమాక్సుకు రాలేదు.
నేనే తొందర పడ్డాను.

ఉద్ధరించడ మంటే
ఉంచుకోవడ మనుకొంటూ
ప్రగతిని చెరబడుతున్న
పెద్దలింకా వున్నారు మిగిలి
పచ్చికాయ కొరికి పడవేయ నేమౌను
అన్నాడు వేమన్న
పక్వమ్మునకు రాని పచ్చికాయలను
కాపుకట్టిన కుళ్ళిపోవె మగ్గెడునె ?
అన్నాడు భీమన్న :
ప్రగతి విప్లవానికి ఇంకా
పరిపక్వం కాలేదు కాలం
సారీ, తొందరపడ్డాను,
ప్యారీ, మళ్ళీ వస్తాను.

(నిష్క్రమిస్తాడు. అప్పుడు కృష్ణార్పణం కదిలి ముందుకు వస్తాడు)

కృష్ణార్పణం :

సారీ, అయినా, నేను సమయానికే వచ్చా ననుకుంటాను. భార్యా భర్తల తగవుల్లో తలదూర్చ గూడదు. కాని... పులి నుంచి మేకను కాపాడ్డం...

దొర :

(కదిలి, దురుసుగా ఎదరకు వచ్చి–) వేటగాడికి అవసరమంటావు ? నా నుంచి ఎవరూ ఎవర్నీ రక్షించలేదు– గుర్తుంచుకో. (కోపంగా నిష్క్రమిస్తాడు)

ప్రగతి :

(కదిలి, ముందుకు వచ్చి, చుట్టూ చూచి, కేలు మోడ్చి) నమస్కారం, సార్, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం యుగే యుగే అవతరించే...

కృష్ణార్పణం :

దేవదేవుణ్ణంటావు నన్ను ? ఇంత గొప్పగా ఎవరూ అనలేదింతవరకు, బాగా అన్నావు.. తెలివైన దానివి, మరి, ఈ రొంపిలో పడ్డావేమిటి?

ప్రగతి :

దారీ, తెన్నూ లేక, మహాశయా, అయిన వాళ్ళు వదిలేస్తే, కానివాళ్ళు కాల్చుకు తింటారు. ప్రస్తుతం నేనొక అనాధను. మీరిక కాపాడక తప్పదు.

కృష్ణార్పణం :

అందుకే వచ్చాను. ఏమిటి నీ కోరిక.

ప్రగతి :

ఉద్యోగం, బ్రతకడానికి ఏదో ఒక పని.

కృష్ణార్పణం :

ఉద్యోగమా ? నౌకరీయా ? పనా ? అర్హతను బట్టి తరతమాలుంటై, తపస్సును బట్టి దేవుడూ, దేవుణ్ణి బట్టి వరాలూ కదా ?

ప్రగతి :

ఏదో ఒకటి ఇప్పించండి. కనీసార్హత వుంది. చాల అవసరంలో వున్నాను. మీ ఋణం వుంచుకోను.

(బైట కారు హారను వినిపిస్తుంది. అబ్బులూ, సుబ్బులూ ప్రవేశించి, అతనికి నమస్కారం చేసి నిలబడతారు. వాళ్ళల్లో ఒకడు సన్నం, ఒకడు లావు, ఉపనాయకుల వేషాలు)

కృష్ణార్పణం :

మన కారు వచ్చిందేమోయ్

అబ్బులు :

వచ్చి చాల సేపయింది సార్

సుబ్బులు :

420 లారీ ఇంకా రాలేదు సార్, ఎప్పుడూ ఇంత ఆలస్యం చెయ్యలేదు.

కృష్ణార్పణం :

(కంగారుగా) ఆఁ ? ఫోన్ చెయ్యి.

సుబ్బులు :

చేశాం, వాళ్ళకే ఏ వార్తా అందలేదు, పోలీసు బుద్ధమూర్తి ఘటికుడు సార్, జాగ్రత్తగా వుండాలి.

అబ్బులు :

ఎమ్. ఎల్. ఎ. గారు చీటీ పంపారు సార్ (అందిస్తారు)

సుబ్బులు :

మంత్రిగారు ఫోన్ చేశారు సార్.

అబ్బులు :

విజిటర్లు చాలసేపటినుంచి ఎదురు చూస్తున్నారు.

సుబ్బులు :

లక్ష్మీకుమారిగారు చాల సేపు కూర్చుండిపోయారు సార్

అబ్బులు :

బాబా గారు ప్రసాదం పంపారు.

కృష్ణార్పణం :

అబ్బబ్బ, పది నిమిషాలు లేకపోతే, పదివేల పని పోగడిపోతుంది. (ప్రగతితో) నీ వద్ద అప్లికేషను ఏదైనా వున్నదా ?

ప్రగతి :

లేదండి.

కృష్ణార్పణం :

లేదు ? పోనీలే, అక్కడే వ్రాయిద్దాం. పద (అందరూ ఒక ప్రక్కకు నిష్క్రమించగా, రెండో ప్రక్క నుంచి మార్గమిత్ర ప్రవేశిస్తాడు రంగంలోకి)

మార్గమిత్ర :

నేను గమనిస్తూనే వున్నాను,
ప్రగతి ప్రగతిని గమనిస్తూనే వున్నాను :
శైథిల్యం నుంచి పుట్టుకొచ్చిన లత
నైరాశ్యంకేసి పెరుగుతున్నది వెత :

కళ, కాంతి, సౌహార్ధం, సౌందర్యం
ఒకొక్కటొకొక్క మాయలేడై ఎరిపిస్తున్నది.
మాయల ఫకీరై పట్టుకొంటున్నది.
మాయ రాజకీయంలో బందిస్తున్నది.

జైలునుంచి వెట్టి చాకిరీకి
నౌకరీ నుంచి దాస్యానికి
పెనం నుంచి పొయ్యిలోకి
బదిలీ తప్ప ప్రమోషను లేని ప్రగతి :
ఎప్పటి కప్పుడు కాలం కాటేస్తుంటే
ఎక్కడి కక్కడ బ్రతికి బైట పడుతున్న ప్రగతి :

నేను గమనిస్తూనే వున్నాను.
వెన్నంటి వస్తూనే వున్నాను
ఉదర పోషణ కంటె ఉన్నత లక్ష్యం లేని
బుద్ధిజీవుల ప్రతినిధిగా
కోపాగ్నిని దిగమింగుకోవడం తప్ప
వెలిగ్రక్కలేని మేధావుల వారసుడిగా

గుడ్లప్పగించి చూస్తున్నాను
గుండె నిలవక అనుసరిస్తున్నాను
స్వార్థ ముఠా రాజకీయాల ఒత్తిడుల్లో
నలిగి నీరవమైపోయింది ప్రగతి
కళ్ళు నెత్తురు కురుస్తున్నా
కాళ్ళు చీమలు కరుస్తున్నా
కదిలిపోతూనే వుంది ప్రగతి

ఆ నాటి దండకారణ్యం నుంచి
ఈ నాటి షర్బతు గార్డెన్సు దాగా
అదే ప్రగతి:

## దృశ్యం అయిదు

(కృష్ణార్పణం గారి షర్బత్ గార్డెన్సు - కుర్చీలు, బల్లలు వగైరా అక్కడక్కడ పడివున్నై - ఆ ప్రక్కనే వున్న పానీయాల నుంచి ఒక పాట వినిపిస్తూ వుంది. పాటకు తాళ గతిలో కదులుతూ అబ్బులూ, సుబ్బులూ బల్లలు సర్దుతూ వుంటారు.)

పాట :

లోకులు కాకులే
కోకిల పిల్ల
లోకువిచ్చా వంటే
నూకలు కల్ల :
చేతి కందిన పూలు
చిదిమి పారేస్తారు

అందక పోతే

ఆరడి పెడతారు

పై నున్న వాళ్ల కాళ్లు

పట్టుకు వేలాడు తారు.

తక్కువ వాళ్ళను

తొక్కుకొని పోతారు

అబ్బులు :

సుబ్బులూ :
(సుబ్బులు పలకడు)

అబ్బులు :

ఒరే, సుబ్బులూ : నీ యమ్మ-

సుబ్బులు :

ఆఁ : నేనూ అదే ఆలోచిస్తున్నాను. నీ యమ్మ--

అబ్బులు :

మన అమ్మల సంగతి ఇక్కడెందుకు గాని, ఆ పిట్ట-

సుబ్బులు :

అదే: దొడ్లో కొచ్చిన పిట్ట గూట్లో కెందుకు రావడం లేదా అని-

అబ్బులు :

పిట్టలన్నీ ఒకేలా వుండవులే, కొన్ని ఇట్టే ఎక్కుతాయి. కొన్ని చిక్కులు పెడతాయి. కొన్ని వేటగాడ్నే చిక్కుల్లో తోసి పోతై

సుబ్బులు :

మన వేట గాడికి వలా, విల్లు కూడ వున్నె, తొందర లేదు.

అబ్బులు :

ఆటవిక సాధనాలు అణు యుగానికి పనికిరావు. ఆటం బాంబును ఆట బాంబు అనుకొంటే ప్రమాదం.

సుబ్బులు :

అంతగా ఆలోచించే తీరిక ఆధునిక నాయకుల కెక్కడుందిలే, ప్రతి వాడూ ఆఫ్టర్ మీ ది డెల్యూజ్ (నా తర్వాత ఏ ప్రళయం వస్తే నాకేం ?) అనుకొనే వాడే ప్రజల మంచి చెడ్డలు ఎవడికీ అక్కరలేదు.

అబ్బులు :

అధికారం వచ్చే దాకా కాళ్ళు, ఆ మీద జుట్టు ఎవడికీ ఎవడి మీదా విశ్వాసం లేదు. దీపం వుండగానే ఇల్లు సర్దుకొంటున్నాడు ప్రతి వాడూ.

సుబ్బులు :

డిగ్రీలలో తేడాలు.

అబ్బులు :

అంతే :

సుబ్బులు :

తర్వాత నాయకత్వం నీదేగా ? కాస్త తర్ఫీదవు :

(అట్టి స్థితిలో కృష్ణార్పణం, వెంట ప్రగతి ప్రవేశిస్తారు. అలసి వున్నాడు. ప్రగతి జ్ఞాసతో పరిసరాలను పరిశీలిస్తుంది.)

కృష్ణార్పణం :

(తాను కూర్చుంటూ) కూర్చో అమ్మాయ్, అబ్బులూ, మన వాళ్ళంతా ఏమై పోయారయ్యా.

అబ్బులు :

ఆయనెవరో మతాతీత ప్రజాస్వామిక జాతీయ సోషలిష్టు నాయకుడట. మీటింగు పెడుతున్నాడట. మన వాళ్ళంతా అక్కడికి పోయారట.

కృష్ణార్పణం :

రాం రహీం రాబర్ట్ మార్క్ స్ ఆనందజీ గారా మేమిటి ? ఈ రోజుల్లో సోషలిష్టు కాని వాడెవడులే. కూటికోసం కోటి విద్యలు.

అబ్బులు :

పురిలో గింజలు పురిలోనే వుండాలి. బిడ్డలు బీరగింజల్లా వుండాలి అనేదే నేటి మన నాయకత్వం కదా, సార్ :

(నాలుగు షర్బతు గ్లాసుల ట్రేతో ప్రవేశించిన సుబ్బులు సంభాషణను అందుకుంటాడు)

సుబ్బులు :

అబ్బే : పురిలో గింజలు పురిలోనే వుండాలి. బిడ్డలు బెండకాయల్లా ఎండి చస్తున్నారనే... అనేది మన రాజకీయం. సార్ (గ్లాసులు బల్లమీద పెడతారు.)

కృష్ణార్పణం :

(ఒక గ్లాసు అందుకొని, ప్రగతి కేసి చాపుతూ) రావే, అమ్మాయ్, ఇది కాస్త తాగు, వెళదాం రా, తీసుకో

ప్రగతి :

(గ్లాసు అందుకొంటూ) ఏమోనండీ, నాకు ఉద్యోగరాత వున్నట్టు కూడ లేదు.

అన్ని చోట్లకు తిరిగాను. ఇంత శ్రమ పడ్డాను. వాగ్దానాలు తప్ప. వాస్తవముగా ఏదీ లభించలేదు. ఇక ఈ ఉద్యోగ వేట మానేద్దాం.

కృష్ణార్పణం :

ఏం చేస్తాం ? మంత్రుల్ని, సెక్రటరీల్ని, గుమస్తాల్ని కూడ చూచేశాం, ఎక్కడి కక్కడే లోగుట్టు, మంత్రి మాట సెక్రటరీ వినడు, సెక్రటరీ మాట గుమాస్తా వినడు, గుమాస్తా మాట–

అబ్బులు :

ఎందుకు వినడు, సార్ ? చెప్పే విధంగా చెప్పాలంతే, అందుకే లంకేశం గార్ని కలవండొక సారి.

సుబ్బులు :

పై నుంచి కిందకీ, కింద నుంచి పైకి లంకేశం గారి మాటంటే వేదం.

కృష్ణార్పణం :

లంకేశం గారికి లంక మేత కావాలయ్యా, మనం తట్టుకోగలమా ? హరప్పా గారు కొంచెం ఊ అంటే...

ప్రగతి :

(ఉలిక్కిపడి) వద్దు వద్దు, నేను స్వతంత్రంగానే బ్రతకాలి. కాలదోషం పట్టిన అహంకారాల దాక్షిణ్యం నాకు వద్దు.

కృష్ణార్పణం :

అదీ నిజమే, ఒక్కగానొక్క కూతురనైనా ఆలోచించాడా ఆయన ? ఇంటికి రావద్దంటే ఏమై పోతుందనుకున్నాడు ? నే నున్నానులేవే. నా ఇల్లే నీ ఇల్లు. ఇంకొక్క ప్రయత్నం చేద్దాం.

అబ్బులు :

పది కోట్ల రూపాయల పేదల ప్రాజెక్టు వుంది కదా సార్ ?

కృష్ణార్పణం :

ఆ మొత్తం సిబ్బంది జీతాలకే చాలడం లే దటయ్యా : పాత వాళ్ళే ఇంకా జీతాలు పెంచమంటున్నారు. కొత్త వాళ్ళకు చోటెక్కడ ?

సుబ్బులు :

ప్రజాస్వామికం కదా సర్, కులానికో టికెటులు, గ్రూపుకో ప్రాజెక్టు ?

అబ్బులు :

ధన స్వామికం, భూస్వామికం, పారిశ్రామికం, పైరవీ స్వామికం, ఈ అన్నీ కలిసిన కుల స్వామికమే మన దేశంలో ప్రజా స్వామికం, కులాతీత మేధావి వర్గానికి కూడు దొరకడం లేదు, సర్.

కృష్ణార్పణం :

జ్ఞానపీఠ్ లాంటి మాటన్నా వోయ్ :

(అప్పటికి వాళ్ళంతా ఒకటి రెండు గ్లాసులు ఖాళీ చేస్తారు. ప్రగతి రుచి చూచి వదిలేస్తుంది.)

కృష్ణార్పణం :

నీ గ్లాసింకా అలాగే వుందా ? తాగవే, పోదాం, అదేమిటి కళ్లొత్తు కొంటున్నావ్? ఛ ఛ కష్టాలు కాపురముంటాయా ? తాగెయ్ రేపు నువ్వే ఒక ఆఫీసరు వైతే...

ప్రగతి :

(కళ్లొత్తుకొని, గడ గడ తాగేసి కంపరించుకొని ) ఏదో వెగటుగా వుందండీ. (వెక్కుతుంది) ఓక్.

కృష్ణార్పణం :

బాగానే వుందే : విదేశీ షర్బత్తు కొంచెం ఘాటుగా వుంది. అందుకే దీన్ని నిషేధించారు మన వాళ్ళు. సుబ్బుల్కా మన బట్టీ లోది తేవయ్యా.

ప్రగతి :

(వికారంగా) వద్దు, వద్దు, ఇంకేదీ వద్దు, ఓక్.. నాకేమీ తెలియడం లేదు. (కుర్చీ మీద వాలిపోతుంది)

కృష్ణార్పణం :

(వెళ్ళి పడిపోకుండా పట్టుకుని, పక్కనే ఆనుకొని కూర్చొని) ఇంత త్వరగా పనిచేసిందేమిటోయ్ ? (మరో గ్లాసు పూర్తి చేస్తాడు)

సుబ్బులు :

మన చేతి చుక్కసార్.

అబ్బులు :

సార్ ఏమిటి ? సారా అను.

కృష్ణార్పణం :

(మెచ్చుకోలుగా)అబ్బ, ఇంత కాలానికి, ఇప్పుడిక ప్రగతి మన అంతఃపుర దాసీ.

సుబ్బులు :

ఒక్క ప్రగతేమిటి, సార్ ప్రపంచాన్నే మీ అంతప్పుర దాసీని చేస్తాం.

కృష్ణార్పణం :

సెబాస్, ఇదిగో నోబెల్ ప్రైజు.

(తన సగం తాగిన గ్లాసును అందిస్తాడు) మన తోట బంగళా తాళం తియ్,
లంకేశం గారికి ఫోను చెయ్యి, ముందాయన శపథం నెరవేరాలి.

సుబ్బులు :

అన్నీ సిద్ధం, సార్ (నిష్క్రమిస్తారు)

అబ్బులు :

లంకేశం గారి శపథ మేమిటి సార్ ?

కృష్ణార్పణం :

అందరితోనూ తిరిగే ప్రగతి నాతో ఎందుకు తిరగదూ అనుకొని, ఒక సారి ట్రై చేసారట లంకేశంగారు. ఆయన్ని పడదోసి పారిపోయిందట, ఈ పాంచాలి.

అబ్బులు :

(ఆశ్చర్యంగా) అంతటి వాణ్ని.

కృష్ణార్పణం :

స్త్రీ ముందు ఎంతటి వాడైనా సుంతటి వాడేలే. అప్పుడు శపథం పట్టాడు లంకేశం.. ఎలాగైనా లొంగదీసుకోవాలని, అందుకు మన సహాయం అర్థించాడు.

అబ్బులు :

అంత కథుందా దీని వెనుక

సుబ్బులు :

(మరో గ్లాసుతో ప్రవేశిస్తూ) మానవజాతి కథంతా ఇదే కథ కదయ్యా, దుర్వర్తన, భంగపాటు, క్రోధం, కుట్ర, ఆది నుంచీ అదేకథ, రామకథ, రాముడంతటి వాడికే మారీచుడి సాయం అవసరమయ్యే.

అబ్బులు :

(గ్లాసు అందుకుని) ఎందుకైనా మంచిది, మరో గ్లాసు పట్టించండి సార్ (బల్ల మీద పెడతాడు)

(కృష్ణార్పణం ప్రగతిని లేపి నిలబెడతాడు. ఆమె కర్రబొమ్మలా తూలి పడిపోతుంది. పట్టుకొని మళ్ళీ నిలబెడతాడు. మళ్ళీ పడిపోతుంది. అలా మళ్ళీ మళ్ళీ, గ్లాసు పట్టించబోతాడు. ఆమెలో చైతన్యమే కనిపించదు. దాన్ని అతడే తాగేస్తాడు. తర్వాత సుబ్బులు సాయపడగా తాను కూడ తూలుతూనే, ప్రగతిని పట్టి నిలబెట్టి నడిపిస్తాడు. ఆమె ఇటూ అటూ ఒదుగుతూ, మెల్ల మెల్లగా అడుగులు వేస్తుంది. ఈ లోగా తెరలో నుంచి ఒక పాట సన్నగా వినిపిస్తూ వుంటుంది. ప్రగతి సూటిగాను, గుండ్రంగాను కూడ నడుస్తూ వెళుతుంది.)

పాట :

యుగ యుగాల నుంచీ
ప్రగతి పథం ఇదేనోయ్
నర నరాల జీర్ణించిన దోషం
నైతిక హత్యా విన్యాసం

పరమ తపోవనిలో అహల్య
పర్ణశాలలో సీతమ్మ
రాజరక్షణలో భారత నారి
ప్రగతిని కొలిచే సర్వేరాళ్ళోయ్

ఎంత కాలమీ హింసా నృత్యమ్ ?
ఎంత దూరమో మానవ లక్ష్యం
కృత యుగాదిగా గుడుగుడు గుంచం
క్షతగాత్రం ఈ ప్రగతి రథం.

## దృశ్యం ఆరు

(షర్బత్ గార్డెన్సులో ఒక చివర భాగం, అశోకా గార్డెన్సు, చీకటి చిట్టడవిలా వుంది రంగం. ప్రగతిని నడిపించు కొంటూ ప్రవేశిస్తారు.... కృష్ణార్పణం, అబ్బులూ,

సుబ్బులూ, తాను నడవగలనన్న సైగచేసి చిరునవ్వు నవ్వి, వాళ్ళ పట్టునుంచి తప్పించుకొని మెల్లగా తూలుతూ అడుగులు వేస్తున్నది ప్రగతి. ఆలోగా లోపలికి పోయి వచ్చిన సుబ్బులు కృష్ణార్పణంతో అంటాడు....)

సుబ్బులు :

లంకేశం గారు తొందరపడుతున్నాడు, సార్, అవతల మంత్రిగారితో సమావేశం ఉందట.

కృష్ణార్పణం :

అబ్బులూ, కాస్త త్వరగా !

(ప్రగతి త్వరగా కదిలినట్టే కదిలి, అట్టే మళ్ళీ గుండ్రంగా తిరుగుతుంది. ఈ అంత సేపూ ప్రగతి అడుగులతో లయ కలుపుతూ ప్రకృతే గానం చేస్తున్నట్టు వెనకనుంచి ఒక పాట వినిపిస్తూ వుంది.)

పాట :

ముందుకే, ముందుకే, ముందుకే
వెనకడుగు వేయకూ
అడుగుకు రెండడుగులు దిగజారినా
వెనుదిరిగి చూడకు

ముందున్నది యే ముసళ్ళ మడుగో
ముద్దిడనున్నది యే విషనాగో
ఓటమి రానీ, ప్రాణం పోనీ...
తుది దాకా పోరాటం మానకు.

కటకటాలు ఆపలేవు నిన్ను,
కసాయీలు తాకలేరు నిన్ను.

కత్తికంటే బలమయింది కంఠం
కంఠంలో వాణీ వీణా ఝంకారం.

(పాట ముగిసే వరకు ప్రగతి నడుస్తూనే వుంది. ఈ లోగా సుబ్బులు మరో గ్లాసు తీసుకురాగా, కృష్ణార్పణం అందుకొని, ప్రగతి నోటివద్ద పెడతాడు. ఆమె తానే దాన్ని అందుకొని జారవిడ్చుస్తుంది. అమ్మోకాలు అంటూ బాధ అభినయిస్తుంది. ఆఁ అంటూ అబ్బులు వంగి ఆమె కాలిని పరామర్శిస్తారు. హఠాత్తుగా ఆమె అబ్బులు డొక్కలో తన్నుతుంది. అతడు అమ్మో అంటూ దొర్లిపోతాడు. హడావిడిగా అడ్డం వచ్చిన సుబ్బుల్ని పడద్రోసి ప్రగతి పారిపోతుంది. అరుస్తూ ఆమెవెంట పడబోయిన కృష్ణార్పణానికి మార్గమిత్ర ఎదురవుతాడు)

మార్గమిత్ర :

ఎక్కడికా పరుగు ?
ఎందులకా మెరుగు ?
ఆగవయ్యా ఆగు,
పోగొట్టుకోకు మతి
ఆపలేవిక నీవు
ప్రగతి పురోగతి

(కృష్ణార్పణం చకితుడై, రెండడుగులు వెనక్కువేసి, హఠాత్తుగా మార్గమిత్ర మీదకు వురుకుతాడు. ఇద్దరికీ ద్వంద యుద్ధం సాగుతుంది. కృష్ణార్పణంది కండబలం, మార్గమిత్రది ఒడుపు.. అంతలో అబ్బులు రివాల్వరుతో ప్రవేశించి, మార్గమిత్రకు గురిచూస్తూ, అదనుకోసం వాళ్ళచుట్టూ కదం త్రొక్కుతాడు. చటుక్కున మార్గమిత్ర ఒక్క మెలికతో కృష్ణార్పణాన్ని పడదోసి, ఏక కాలంలోనే అబ్బులు చేతిలోని రివాల్వరును ఎగరతంతాడు. బైట తుపాకీలు పేలిన శబ్దం. కదలవద్దు అనే ఆజ్ఞ. రంగం భీతావహమవుతుంది.

కృష్ణార్పణం లేచి పారిపోబోగా మార్గమిత్ర పట్టుకుని గుంజి ముందుకు తోస్తాడు. అతడు పోయి అప్పుడే రంగంలోకి వచ్చిన పోలీసు ఆఫీసరు కాళ్ళముందు పడతాడు. ఆఫీసరు బుద్ధమూర్తి తేజస్వి. హసన్ముఖుడు)

బుద్ధమూర్తి :

(కఠినంగా) కదలవద్దు, ఎవరూ కదలవద్దు, (బైట తుపాకి ప్రేలుడు) కదిలితే ప్రమాదం ఎవరూ కదలవద్దు.

మార్గమిత్ర :

(పారిపోబోయిన అబ్బుల్ని బుద్ధమూర్తికేసి తోసి) ప్రగతీ, ప్రగతీ ఎక్కడ? (హడావిడిగా నిష్క్రమిస్తాడు)

బుద్ధమూర్తి :

(అప్పటికే అక్కడికి వచ్చి వున్న పోలీసులతో) వీళ్ళని తీసుకుపోయి వాళ్ళతో చేర్చండి.

(అబ్బుల్ని, కృష్ణార్పణాన్ని తీసుకొని పోలీసులు నిష్క్రమిస్తారు.)

(ప్రగతీ, ప్రగతీ ఎక్కడ ? అనే పిలుపు తెరలోనుంచి వినిపిస్తూనే వుంటుంది. ప్రగతి పరిగెత్తుకొంటూ రంగంలోకి వస్తుంది. బుద్ధమూర్తిని చూచి, ఆగి, బెదిరి, మళ్ళీ పారిపోబోతుంది)

బుద్ధమూర్తి :

అమ్మా, ఆగు, ఆగమ్మా ఆగు, ఇక భయంలేదు.

ప్రగతి :

(ఆగి) నన్ను పోనివ్వండి, నాకున్నదంతా భయమే, నా కీలోకంలో స్థానం లేదు, పైగా మీ ఆధీనంలో....

బుద్ధమూర్తి :

(చిరునవ్వుతో) తల్లీ, నీవు కూడ అలా అంటే ఎలా ? లోకంలో నీకే స్థానం లేకపోతే మాకా వుంది ? సమాజం బ్రతికే వుంది. ప్రగతిలేని సమాజంలో పట్టపగలే గాఢాంధకారం....

ప్రగతి :

గౌతమీపుత్ర వఱ కది

బుద్ధమూర్తి :

అదే అతడి పిలుపు, పలుకు

(తెరలో ప్రగతీ అనే పిలుపు)

బుద్ధమూర్తి :

పలుకమ్మా పలుకు,

(ప్రగతి అనుమానిస్తుంది. పలకదు. ఎన్నిసార్లు పిలుపు వినబడినా పలకదు. భయంతో కంపిస్తుంది.)

బుద్ధమూర్తి :

పలుకమ్మా, పలుకు, భయం లేదమ్మా పలుకు.

ప్రగతి :

నా అనుభవంలో అభయం లేదు! మహాశయా, ఇది మరో నాగుర కాదా ?

బుద్ధమూర్తి :

కాదు, నీ మహా కవినే నీవు నమ్మవా ? (తెరలో పిలుపు) నీ ప్రజల పిలుపుకే నీవు ప్రతి పలకవా ? (అప్పుడు ప్రగతీ ప్రగతీ అంటూ అనేక కంఠాలతో పిలుపు)